

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 247 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 14 జనవరి 2026 | వెల : 4/-


## ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు

- పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయం చేసుకోవడంతోపాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైంది



హైదరాబాద్

ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు సృష్టించిందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు నెలకొల్పిందన్నారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించిందని చెప్పారు. - మిగతా3లో

## ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది



- పాకిస్తాన్‌కు చుక్కలు చూపిస్తాం
- భవిష్యత్‌లో ఎలాంటి కవ్వింపు చర్యలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటాం
- ఆర్మీ చీఫ్ హెచ్చరిక



## రాష్ట్రాలకు సుప్రీం హెచ్చరిక

- విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, క్రీడా సముదాయాలు, రైల్వే స్టేషన్ల వంటి ప్రజా ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలి
- వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డాగ్ షెల్టర్లకు తరలించాలి
- రాష్ట్రాలు సరైన చర్యలు తీసుకోకుంటే పెద్దలను, పిల్లలను కుక్కలు కరిస్తే అధిక మెత్తంలో రాష్ట్రాలు పరిహారం చెల్లించేలా ఆదేశిస్తాం
- అదేవిధంగా కుక్కలకు ఫుడ్ పెట్టేవారు వారి ఇంట్లోని వాటిని పెంచుకొని అక్కడే వాటికి తిండిపెట్టండి".

# రంగంలో సీఎం!

- మున్సిపల్ ప్రచారం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, 'ఉపాధి హామీ'నిరసనలు
- ముఖ్యమంత్రి జిల్లాల పర్యటన షెడ్యూల్ ఖరారు
- బహిరంగ సభలతో పాటు వీలున్న చోట్ల కార్నర్ మీటింగ్‌లు
- ఈ నెల 16, 17, 18 తేదీల్లో తొలి విడత..ఫిబ్రవరి 3 నుంచి మలి విడత



హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్య టన ఈ దఫా త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగనుంది. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ప్రచారం, పలుచోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధి పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడానికి నిరసనగా సభలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా రెండు దఫా ల పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. తొలి విడతలో ఈనెల 16, 17, 18 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలకు వెళ్తారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతోపాటు పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తారు. నిర్మల్, మహబూబ్‌నగర్‌లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు హాజరవుతారు. 19వ తేదీన మేడారం వెళ్తారు. అదే రోజు సింగపూర్, అమెరికా దేశాల పర్యటనకు వెళ్తారు. ఫిబ్రవరి 1న హైదరాబాద్ తిరిగి వస్తారు. మరుసటి రోజు వీలును బట్టి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఫిబ్రవరి 3 నుంచి మలి విడత జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడతారని సీఎంవో వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు ఖరారైన షెడ్యూల్ ప్రకారం ఆయున ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు ఆరు ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తారు. వరుసగా నల్లగొండ, కరీంనగర్, - మిగతా3లో



## త్వరలో తీపి కబురు

- ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ వేతన పరిమితి పెంపు?
- ఉద్యోగుల సామాజిక భద్రతా పథకాలను మరింత బలోపేతం
- ప్రస్తుత సమాచారం ప్రకారం, ఈ రెండు సంస్థల వేతన పరిమితిని నెలకు రూ.25,000 నుంచి రూ.30,000 మధ్య స్థాయికి పెంచాలని భావిస్తోంది



## ఇరాన్‌లో భగ్గుమన్న ప్రజాగ్రహం

- నిరసనల్లో 2 వేల మంది మృతి
- ఇరాన్‌లో నిరసనల్లో వేల మంది మృతి
- రాయిటర్స్‌కు వెల్లడించిన ఇరాన్ ప్రభుత్వ అధికారి
- ఆర్థిక సంక్షోభంతో దేశవ్యాప్తంగా చెలరేగిన ఆందోళనలు






## పురపోరుకు ముమ్మరంగా
# కసరత్తు

- తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు.. తుది ఓటర్ల జాబితా ప్రకటించిన ఈసీ
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడి
- నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధిక ఓటర్లు
- కొత్తగూడెంలో అత్యల్పంగా 1,34,774 మంది ఓటర్లు
- మున్సిపల్ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది
- జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు



హైదరాబాద్:

తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరే షన్లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు కాగా.. 26,80, 014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది - మిగతా3లో

# రాజకీయాల్లో నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి

ఎమ్మెల్యేపై అనవసర ఆరోపణలు మానుకోవాలి..
ప్రజాస్వామ్యం వర్ధిల్లేలా వ్యాఖ్యలు చేయడం సహేతుకం..
ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు..
తీరు మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో బాధపడాల్సిందే..
మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఉప్పరపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి హితువు







**రాజేంద్రనగర్,జనవరి13(సూర్యరేఖ)** మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఉప్పరపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి సూచించారు. ఉన్నతమైన పదవిలో ఉంటూ ప్రజలు అసహ్యించుకునేలా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఇలాంటి ధోరణి రాజకీయాల్లో మంచి పద్ధతి కాదని,ఎమ్మెల్యేను టార్గెట్ చేయడం మానుకొని ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని హితువు పలికారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా, ప్రజాస్వామ్యం వర్ధిల్లేలా వ్యాఖ్యలు ఉండాలని ఇలాంటి తప్పుడు ధోరణిలో మాట్లాడే మాటలు ఎప్పటికీ ఆమోదనీయం కాదని వివరించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై తోకల శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.అనంతరం సామ ఇంద్రపాల్ రెడ్డి మాట్లాడుతూ...కార్పొరేటర్ హోదాలో ఉన్న వ్యక్తి అనవసరంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై నోరు పారేసుకుంటున్నారన్నారు.ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.ప్రజా ప్రతినిధులు తమ స్థాయిని విస్మరించి,భాష, సంస్కారాన్ని గుర్తుంచుకుని మాట్లాడాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నాలుగు సార్లు గెలిపించిన ప్రజల తీర్పు,ఆ నాయకుడిపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు.ప్రజల మద్దతు లేకుండా ఎవరూ పదవుల్లో నిలబడలేరనే వాస్తవాన్ని గుర్తించాలన్నారు.గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ పరిపక్వతకు నిదర్శనం కాదన్నారు.ముందు ఆత్మవిమర్శ చేసుకొని మాట్లాడాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే శాసనసభలో,ప్రభుత్వ స్థాయిలో నిరంతరం పోరాటం చేసిన విషయం గుర్తుంచు కోవాలన్నారు.ప్రజలు పదే పదే ఆయన్నే ఎన్నుకోవడం ఆయన పనితీరుకు నిదర్శనమన్నా రు.రంగారెడ్డి జిల్లాను సైబరాబాద్ లో కలపడా నికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజల చేత గెలిచిన ప్రకాష్ గౌడ్ ను విమర్శించే ముందు ఆలోచించుకోవాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని హైదరాబాద్‌లో విలీనం చేస్తారన్న అంశంపై ఎలాంటి అధికారిక జీవో రాకముందే,మొదటిగా రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపిన నాయకుడు ఎమ్మెల్యే అని,ప్రజల హక్కుల కోసం ఆయన పోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు.లేని జీవోల గురించి ఆధారంలేని లీకుల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించడం బాధ్యతారాహిత్యానికి ఉదాహరణగా నిలుస్తుందన్నారు.ప్రభుత్వ నిర్ణయాలు అధికారికంగా వెలువడిన తరువాత మాత్రమే స్పందించాలన్నారు.ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.రంగారెడ్డి జిల్లా నాయకులు సమిష్టిగా ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వగా,సీఎం కూడా ప్రజలకు అన్యాయం జరగనివ్వనని స్పష్టంగా తెలిపారని వివరించారు.ప్రజా ప్రతినిధులు ఎవరి మెప్పుకోసం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారానికే పని చేయాలని,ఐదేళ్లకు ఒకసారి మాత్రమే కనిపించే నాయకత్వం ప్రజలకు ఉపయోగపడదని గుర్తించాలన్నారు.మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదని,అన్ని మతాలను గౌరవించడం భారతదేశ సంప్రదాయమన్నారు.మతపరమైన వ్యాఖ్యలతో సమాజంలో విభేదాలు సృష్టించడం బాధ్యతాయుత రాజకీయానికి విరుద్ధమన్నారు. సంబంధిత కార్పొరేటర్ తన వ్యాఖ్యలపై పునరాలోచన చేసి,భవిష్యత్తులో బాధ్యతాయుతం గా గౌరవప్రదంగా మాట్లాడాలని సూచించారు. లేకపోతే ప్రజలు తగిన రీతిలో స్పందించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

## భారత ఆవిష్కరణలకు నెట్‌ఫ్లిక్స్ చేయూత



భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కలిసి ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో కీలక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి అనుగుణంగా 'ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటర్స్ – నయే భారత్ కీ నయీ పెహచాన్' పేరుతో ఒక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని మంగళవారం సంయుక్తంగా ప్రారంభించాయి. కథల ద్వారా నైపుణ్యాలను, స్టార్టప్‌లను ప్రోత్సహించి దేశంలో ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమం కింద, సామాజిక ప్రయోజనం లక్ష్యంగా పనిచేస్తున్న 8 భారతీయ స్టార్టప్‌లను పీఎస్‌ఏ కార్యాలయం ఎంపిక చేసింది. ఈ స్టార్టప్‌ల విజయగాథలను దేశంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, సత్యజిత్ రే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ సహా 8 ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు యానిమేటెడ్ లఘుచిత్రాలుగా రూపొందించారు. నెట్‌ఫ్లిక్స్ ఫండ్ ఫర్ క్రియేటివ్ ఈక్విటీ సహకారంతో గ్రాఫిటీ స్టూడియోస్ ఈ ప్రాజెక్టును అమలు చేసింది. ఈ చిత్రాలకు అవసరమైన వాయిస్‌ఓవర్‌లను, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (చీఖీణజ) భాగస్వామ్యంతో నెట్‌ఫ్లిక్స్ నిర్వహిస్తున్న 'వాయిస్‌బాక్స్' స్కిల్లింగ్ ప్రోగ్రాం అభ్యర్థులు అందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన 26 మంది విద్యార్థులలో 50 శాతం మహిళలు ఉండగా, పలువురు ద్వితీయ శ్రేణి నగరాల నుంచి రావడం గమనార్హం. ఈ సందర్భంగా పీఎస్‌ఏ ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ మాట్లాడుతూ.. "సామాజిక ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు, యువతలో నైపుణ్యాలను పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది" అని వివరించారు. సృజనాత్మకతను సమాజ సేవకు ఎలా ఉపయోగించవచ్చో ఈ కార్యక్రమం తెలియజేస్తోందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, యువ సృజనకారుల కలయికతో భారత ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## రాష్ట్రాలకు సుప్రీం కోర్టు హెచ్చరిక

**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా వీదికుక్కల బెడద తీవ్రమైన నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రాలు వీధి కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోకుంటే కఠిన చర్యలు విధిస్తామని ప్రకటించింది. శునకాలు కరవడం వల్ల పిల్లలు లేదా పెద్దలు ఎటువంటి ప్రమాదానికి గురైనా దాని సంబంధించి రాష్ట్రాలే పరిహారం చెల్లించేలా ఆదేశిస్తామని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా వీధికుక్కల దాడులు పెరగడంతో ప్రజలలో రేబీస్‌తో పాటు ఇతర ప్రమాదకర వ్యాదులు పెరిగాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, క్రీడా సముదాయాలు, రైల్వే స్టేషన్ల వంటి ప్రజా ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలని, వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డాగ్ షెల్టర్లకు తరలించాలని అధికారులను ఆదేశించింది. అయితే తాజాగా ఈ కుక్కల బెడద కేసును సుప్రీంకోర్టు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ రోజు( మంగళవారం) మరోసారి విచారించింది. ఈ నేపథ్యంలో జస్టిస్ విక్రమ్ నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు "వీధి కుక్కల బెడద నివారణకు రాష్ట్రాలు సరైన చర్యలు తీసుకోకుంటే పెద్దలను, పిల్లలను కుక్కలు కరిస్తే అధిక మెత్తంలో రాష్ట్రాలు పరిహారం చెల్లించేలా ఆదేశిస్తాం. అదేవిధంగా కుక్కలకు ఫుడ్ పెట్టేవారు వారి ఇంట్లోని వాటిని పెంచుకొని అక్కడే వాటికి తిండిపెట్టండి". అని జస్టిస్ తీవ్రవ్యాఖ్యలు చేశారు. జంతు ప్రేమికులము అని చెప్పుకునే సంస్థలు తొమ్మిదేళ్ల బాలుడిపై శునకాలు దాడి చేసినప్పుడు ఏందుకు బాధ్యత తీసుకోలేదు అని జస్టిస్ ప్రశ్నించారు. అదే విధంగా కుక్కలకు ఆహారం ఇచ్చేవారిపై వేదింపులకు గురవుతున్నాయి అని వచ్చిన పిటిషన్‌ను తీసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. అది శాంతిభద్రతల సమస్యని అలా వేధింపులకు గురైన వారు వ్యక్తిగతంగా కేసు నమోదు చేసుకోవాలని సూచించింది. వీధుల్లోని అన్ని కుక్కలను తొలగించాలని తామెప్పుడూ ఆదేశించలేదని యనిమల్ బర్త్ రూల్ ప్రకారం చికిత్స కాని వాటిని షెల్టర్లకు తరలించాలని తెలిపినట్లు సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

## ఇరాన్ లో భగ్గుమన్న ప్రజాగ్రహం...



ఇరాన్‌లో గత రెండు వారాలుగా కొనసాగుతున్న ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. ఈ నిరసనల్లో భద్రతా సిబ్బందితో సహా దాదాపు 2,000 మంది మరణించినట్లు ఇరాన్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. ఇరాన్ ప్రభుత్వం ఇంత పెద్ద సంఖ్యలో మరణాలను అంగీకరించడం ఇదే మొదటిసారి. దేశంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం, అధిక ద్రవ్యోల్బణం, స్థానిక కరెన్సీ (రియాల్) విలువ పడిపోవడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. డిసెంబర్ 28, 2025న తెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌లో మొదలైన ఈ నిరసనలు, అనతికాలంలోనే దేశంలోని 31 రాష్ట్రాలకు విస్తరించాయి. ఈ మరణాలకు ఉగ్రవాదులే కారణమని, వారే ప్రజలు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని సదరు అధికారి ఆరోపించారు. అయితే, మృతుల్లో పౌరులు ఎంతమంది, భద్రతా సిబ్బంది ఎంతమంది ఉన్నారనే వివరాలు వెల్లడించలేదు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అధికారంలోకి వచ్చిన మతపరమైన నాయకత్వానికి, గత మూడేళ్లలో ఇదే అతిపెద్ద అంతర్గత సవాలుగా మారింది. ఆర్థిక సమస్యలపై నిరసనలు చట్టబద్ధమే అని చెబుతూనే, ప్రభుత్వం కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది. ఈ అల్లర్ల వెనుక అమెరికా, ఇజ్రాయెల్ హస్తం ఉందని ఇరాన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో సమాచార వ్యాప్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. భద్రతా బలగాలు, నిరసనకారుల మధ్య ఘర్షణలు, కాల్పుల ఘటనలకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఆరెస్సెస్ ప్రతినిధులతో సమావేశమైన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా బృందం

చైనా బృందం నేడు ఆరెస్సెస్ ప్రతినిధులతో సమావేశమైంది. నిన్న బీజేపీ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన చైనా బృందం... ఇవాళ ఢిల్లీలోని ప్రేరణ బ్లాక్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యులతో భేటీ అయింది. షక్సాగామ్ లోయపై చైనా, భారత్ మధ్య వాగ్యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ భద్రతాంశాల్లో చైనాతో ఇలాంటి సంప్రదింపులు సరికాదని పేర్కొంది. ఆరెస్సెస్ వర్గాల ప్రకారం, చైనా ప్రతినిధి బృందం ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలేను కలిసింది. ఇది



కేవలం మర్యాదపూర్వక భేటీ అని తెలిపాయి. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) విజ్ఞప్తి మేరకు గంటసేపు సమావేశమైనట్లు వెల్లడించాయి. "ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే. ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ పర్యటనలో ఉన్నందున హాజరు కాలేదు. చైనా ప్రతినిధి బృందం దత్తాత్రేయ హోసబలేను కలిసింది. ఈ సమావేశానికి నిర్దిష్ట అజెండా ఏమీ లేదు" అని ఆరెస్సెస్ ప్రతినిధులు తెలిపారు. గత సంవత్సరం ఆగస్టులో ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. అయితే, పాకిస్థాన్, టర్కీ, చైనా దేశాల ప్రతినిధులను మాత్రం ఆహ్వానించలేదు.

# అయోధ్య నుండి పూరి.. ఐఆర్సీటీసీ గోల్డెన్ ఆఫర్

**న్యూఢిల్లీ:** దేశంలోని ప్రయాణికుల సౌకర్యార్థం భారతీయ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తరచూ సరికొత్త ప్యాకేజీలను ప్రకటిస్తూ ఉంటుంది. ఇందులో భాగంగా తాజాగా 'భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు' ద్వారా ఒక ఆధ్యాత్మిక యాత్రను ప్రకటిచింది. తొమ్మిది రాత్రులు, 10 పగటి రోజులు సాగే ఈ సుదీర్ఘ యాత్ర ఫిబ్రవరి 5వ తేదీన ప్రారంభమై, ఫిబ్రవరి 14వ తేదీతో ముగుస్తుంది. ఈ యాత్ర చేయాలనుకునేవారు గయ, పూరి జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, కోల్‌కతా, గంగాసాగర్, బైద్యనాథ్ ధామ్, వారణాసి, అయోధ్య తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు.ఈ ప్రత్యేక పర్యాటక రైలు ఆగ్రా కాంట్ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరుతుంది. ప్రయాణికులు ఈ పర్యటనలో గయలోని విష్ణుపాద ఆలయం, పూరిలోని జగన్నాథ స్వామి ఆలయం, కోణార్క్‌లోని సూర్య దేవాలయం, కోల్‌కతాలోని గంగాసాగర్, జసిదిహ్‌లోని బైద్యనాథ్ ధామ్, వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయం, అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి, హనుమాన్ గర్హి తదిరత పవిత్ర క్షేత్రాలను దర్శించుకోవచ్చు. ఈ రైలులో మొత్తం 767 సీట్లు అందుబాటులో ఉన్నాయి వీటిలో 2 ఏసీ విభాగంలో 49, 3 ఏసీ విభాగంలో 70, స్లీపర్ క్లాస్‌లో 648 సీట్లు ఉన్నాయి. ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా ప్రయాణికులకు సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ లేదా స్లీపర్ క్లాస్ ప్రయాణ సౌకర్యంతో పాటు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో శాకాహార



భోజనం అందిస్తారు. అలాగే స్థానిక ప్రాంతాల సందర్శన కోసం ఏసీ లేదా నాన్-ఏసీ బస్సుల సౌకర్యం ఉంటుంది. ధరల విషయానికి వస్తే ఎకానమీ (స్లీపర్) క్లాస్‌కు ఒక్కొక్కరికి రూ. 19,110, స్టాండర్డ్ (థర్డ్ ఏసీ) క్లాస్‌కు రూ. 31,720, కంఫర్ట్ (సెకండ్ ఏసీ) క్లాస్‌కు ₹41,980 గా నిర్ణయించారు. ఐదేళ్ల నుండి 11 ఏళ్ల లోపు పిల్లలకు స్వల్ప రాయితీతో కూడిన ధరలు వర్తిస్తాయి. ఈ ఆధ్యాత్మిక యాత్రను బుక్ చేసుకోవాలనుకునే భక్తులు ఐఆర్సీటీసీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టిక్కెట్లు రిజర్వ్ చేసుకోవచ్చు. ప్రయాణికుల ఆర్థిక వెసులుబాటు కోసం ఈ ప్యాకేజీని ఈఎంఐ (ఈఎంఐ) పద్ధతిలో కూడా పొందే అవకాశం కల్పించారు. ఐఆర్సీటీసీ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ద్వారా సులభ వాయిదాల పద్ధతిలో నగదు చెల్లించే వెసులుబాటు ఉంది. తక్కువ ఖర్చుతో దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శించాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశం అని ఐఆర్‌సీటీసీ తెలిపింది.

# రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం..

రహదారి భద్రతా నియమాలతోనే సురక్షిత ప్రయాణం..
చిన్న చిన్న పొరపాట్లతో కుటుంబాల్లో తీరని శోకం..
హెల్మెట్ ప్రాణకవచంనిర్లక్ష్యం వద్దు
పట్టణ సీఐ శశిధర్ రెడ్డి
రోడ్డు ప్రమాద తీవ్రత భయానకరం,గాయాలతో బాధితుల వేదన వర్ణనాతీతం
దంత వైద్యుడు డాక్టర్ రాజశేఖర్





**మందమర్రి,జనవరి13(సూర్యరేఖ)** ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని పట్టణ సీఐ కే శశిధర్ రెడ్డి కోరారు.రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన' అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పాత బస్టాండ్ లక్ష్మీభవాని కాలనీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 13నుండి 24 వరకు రోడ్డు భద్రత గురించి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని పోలీస్ శాఖ తరపున నిర్వహిస్తుదన్నారు. అతివేగం మద్యం సేవించి వాహనం నడపడం,హెల్మెట్ ధరించకపోవడం వంటి చిన్న చిన్న పొరపాట్లు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం లక్ష్మీభవానికాలనీకి చెందిన ప్రముఖ దంతవైద్యులు డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేక పోవడం వల్ల తలకు,దవడలకు తగిలే గాయాల తీవ్రతను కళ్ళకు కట్టినట్లు వివరించారు.వైద్యం కోసం తన వద్దకు వచ్చే వారిలో హెల్మెట్ లేక దవడలు విరిగిపోయి,ముఖం వికృతమై,ఆహారం కూడా తీసుకోలేక నరకయాతన పడేవారిని చూస్తుంటే చాలా బాధగా ఉంటుందన్నారు. ఆపరేషన్లు చేసినా పాత రూపు రావడం కష్టం.మీ ముఖాన్ని, మీ నవ్వును,మీ ప్రాణాన్ని కాపాడుకోవాలంటే హెల్మెట్ తప్పనిసరిగా ధరించండి"అని హితవు పలికారు.ఈ సదస్సులో గతంలో రోడ్డు ప్రమాదాల్లో తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులు పాల్గొని తమ ఆవేదనను పంచుకున్నారు."మా ఇంట్లో సంపాదించే వ్యక్తిని ఒక చిన్న యాక్సిడెంట్‌లో కోల్పోయాం, నేడు మా పిల్లల చదువులు,ఇంటి బాధ్యతలు భారమై దిక్కుతోచని స్థితిలో ఉన్నామని,మాకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదని,రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోండి"అంటూ వారు కన్నీటి పర్యంతమయ్యారు.వారి మాటలు కాలనీవాసులను ఆలోచింపజేశాయి.ఈ సందర్భంగా కాలనీవాసులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై శివనీతి రాజశేఖర్, ఏఎస్ఐ మిలింద్ కుమార్, కాలనీ పెద్దలు దుర్గం ప్రభాకర్, కాసర్ల శ్రీనివాస్, ఆటో యూనియన్ అధ్యక్షుడు మొయ్య రాంబాబు ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలకం

అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేయాలి..
గ్రామ పంచాయతీల కార్యదర్శులతో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్





**శంషాబాద్,జనవరి13(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో అన్ని గ్రామాల అభివృద్ధికి సహకరించడం జరుగుతుందని,ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల కార్యదర్శులు పని చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు.గ్రామాల సమగ్ర అభివృద్ధి,ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో అందరూ దృష్టి పెట్టాలని వివరించారు.పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పనిచేయాలని వ్యాఖ్యానించారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శంషాబాద్ మండలానికి చెందిన 21గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని,ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించి కనీస సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.గ్రామాల్లోని రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ,వీధి దీపాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని,ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లోని నర్సరీల నిర్వహణ,మొక్కల పెంపకం, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే ఇంకుడు గుంతల నిర్మాణం గురించి ఆరా తీసి,వాటి పురోగతిపై దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వ పథకాలు,సేవలు నేరుగా ప్రజలకు అందేలా చూడటంలో కార్యదర్శులు వారధిలా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో శంషాబాద్ ఎంపీడీవో ముని ఎంపీఓ రమేష్,వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను త్వరితగతిన నిర్మించాలి





జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్..

**రామాయంపేట,జనవరి13(సూర్యరేఖ)** :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం రామాయంపేట మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న ఇండియా ఇంటిగ్రేటెడ్ గ్రేటర్ స్కూల్ నిర్మాణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ..జిల్లాలోని విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీలో ముందు వరుసలో ఉంచేందుకు ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతుందని అన్నారు.ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు,అనుకూల వాతావరణం,రవాణా సదుపాయం,విద్యార్థులకు ఏ మేరకు భద్రత ఉంటుంది,నేల స్వభావం తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. సమగ్ర సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి సంబంధించి స్థల సేకరణ,నిర్మాణ పనులు,తదితర అంశాలపై అధికారులు అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ఈ నిర్మాణాలపై సమీక్షిస్తూ ఉండాలని ఆదేశించారు.ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో నిర్మాణ ప్రదేశాలకు వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ రజనీకుమారి,అధికారులు ఉన్నారు.

## పురపోరుకు కసరత్తు ముమ్మరం

-మొదటిపేజీ తరువాయి

ఓటర్లు ఉండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా.. అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా రిజర్వేషన్లు ఖరారైన తర్వాత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలక శాఖ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

## రంగంలో సీఎం!

-మొదటిపేజీ తరువాయి

రంగారెడ్డి, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాలకు వెళతారు. తొలి దఫా తరహాలోనే వీలును బట్టి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారు. కార్యకర్తలతో సమావేశాలు, కార్నర్ మీటింగ్‌ల ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ సభలకు హాజరవుతాఉరు. ఇక ఉపాధి హామీ పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సభలను విజయవంతం చేసే బాధ్యతను స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులకు టీపీసీసీ అప్పగించనుంది. కాగా చివరి రోజు, రెండు రోజుల్లో సీఎం వెళ్లే మెదక్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన షెడ్యూల్ ఇంకా పూర్తి స్థాయిలో ఖరారు కావాల్సి ఉంది.

## ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు

-మొదటిపేజీ తరువాయి

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చారిత్రక మైలురాయి అని అభివర్ణించారు. పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయం చేసుకోవడంతోపాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని స్పష్టం చేశారు. ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగ చేసుకుంటున్న రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని మంత్రి వివరించారు. తెలంగాణలో సాధించిన దిగుబడికిగాను రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామన్నారు.

## గులాబీ చిక్కముళ్లు..

## కవిత తప్పేంత? కేటీఆర్ చేసిన ద్రోహం ఏంటి?

**హైదరాబాద్ :** రాజకీయాలలో ముఖ్యంగా కుటుంబాలు నడిపే పార్టీలలో అంతర్గతంగా కుమ్ములాటలు చోటు చేసుకోవడం మనదేశంలో కొత్తేమీ కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీలో సంజయ్ గాంధీ వ్యవహార శైలి ఈ దేశ ప్రజలకు సుపరిచితమే. తమిళనాడులో డీఎంకే, ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు.. అంతిమంగా అధికారం కోసం, అలవిమాలిన సంపాదన కోసం జరిగే పోరాటాలు ప్రాంతీయ కుటుంబ పార్టీల అసలు బాగోతాన్ని బయటపెడతాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి భారత రాష్ట్ర సమితి కూడా చేరింది.2014లో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలంగాణలో వ్యవస్థలను ఎంత నాశనం చేయాలో అంత చేసింది. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలను అడ్డగోలుగా కొనేసింది. ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకుంది. కాళేశ్వరం నుంచి మొదలు పెడితే గొర్రెల పంపిణీ వరకు ఇలా ప్రతి పథకంలోనూ అవినీతి జరిగిందని, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వినిపించాయి. వాస్తవానికి ఇటువంటి కుంభకోణాలు పార్టీకి డ్యామేజ్ చేయడం ఒక ఎత్తు అయితే.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కలిగించే డ్యామేజ్ మరొక ఎత్తు.వాస్తవానికి గులాబీ పార్టీలో ఈ స్థాయిలో అంతర్గతంగా కుమ్ములాటలు జరుగుతాయని ఎవరూ ఊహించలేదు. సాక్షాత్తు కెసిఆర్ కుమార్తె వ్యతిరేక స్వరాన్ని వినిపిస్తారని.. తన తండ్రి పరిపాలనను ఉదాహరణలతో వివరిస్తూ విమర్శిస్తారని ఎవరూ అంచనా వేయలేదు. కాళేశ్వరం ప్రయోజనం నెరవేరలేదని, పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పండబెట్టారని, సామాజిక తెలంగాణ సహకారం కాలేదని ఇలా ప్రతి విషయంలోనూ కవిత విమర్శలు చేసుకుంటూ పోయారు. కొన్ని సందర్భాలలో లెక్కలతో సహా వివరించారు. ఒక రకంగా ఈ పనిని కాంగ్రెస్ చేయాల్సి ఉండేది. ఒక రకంగా బలమైన స్వరాన్ని వినిపించే ప్రయత్నం చేశారు కవిత.కవిత చేస్తున్న ఆరోపణల్లో నిజం లేకపోలేదు. కానీ 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఏం చేశారు అనేది ఇక్కడ అసలైన ప్రశ్న. భారత రాష్ట్ర సమితి ఏర్పాటును వ్యతిరేకించానని చెప్పిన ఆమె.. పార్టీ ప్రారంభత్సవానికి ఢిల్లీ ఎందుకు వెళ్లినట్టు? 10 సంవత్సరాల కాలంలో తెలంగాణలో విధ్వంసం జరిగిందని చెబుతున్న ఆమె.. గతంలో బంగారు తెలంగాణ సాకారం అయిందని ఎందుకు చెబుతున్నట్టు.. లిక్కర్ కేసులో అడ్డంగా ఇరుక్కుపోయారు కాబట్టి.. కేసుల నుంచి తప్పించుకోవాలంటే ఆమె కెసిఆర్ కు వ్యతిరేకంగా వ్యవహరించాలి కాబట్టి.. అలానే చేస్తున్నారని గులాబీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి రాజకీయాల లక్ష్యాలకు అనుగుణంగా ఆమె నడుచుకుంటున్నారని గులాబీ నేతలు మండిపడుతున్నారు.వాస్తవానికి తన పార్టీలో ఉన్నప్పుడు ప్రాధాన్యం దక్కలేదని పదేపదే ఆరోపిస్తున్న కవిత.. ఒకసారి ఎంపీ ఎలా అయ్యారు? మరోసారి ఎమ్మెల్సీ ఎలా అయ్యారు? సింగరేణిలో అధ్యక్షురాలిగా ఎలా ఉన్నారు? ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయని గులాబి పార్టీ నేతలు అంటున్నారు. అధికారం దూరంగానే కెసిఆర్ కు వ్యతిరేకంగా మాట్లాడటం సమంజసం కాదని ఆమెకు గుర్తుచేస్తున్నారు. మరోవైపు జాగృతి నేతలు స్పందిస్తున్న తీరు వేరే విధంగా ఉంది. కేటీఆర్ కూడా ఆమెకు ద్రోహం చేశారని.. కనీసం ఒక పని కూడా చేసుకునే అవకాశం కల్పించలేదని.. ఆమె భర్త ఫోన్ కూడా టాప్ చేశారని.. అలాంటప్పుడు ఆమె పార్టీలో ఎలా ఉంటారంటూ జాగృతి నేతలు చెబుతున్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో హరీష్ రావు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని.. అందువల్లే కవిత ఆయన టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేస్తున్నారని జాగృతి నేతలు చెబుతున్నారు.. కవిత రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేక ఆమెకు అడుగడుగునా అడ్డు పుల్లలు వేస్తున్నారని.. అందువల్లే కవిత ఈ స్థాయిలో స్పందిస్తున్నారని జాగృతి నేతలు అంటున్నారు.కవితకు, కెసిఆర్ కు మధ్యలో గ్యాప్ రావడానికి ప్రధాన కారణం హరీష్, సంతోష్ రావు అని జాగృతి నేతలు చెబుతున్నారు. అందువల్లే ఆమె ఆధారాలతో సహా విమర్శలు చేస్తున్నారని.. ఇందులో వ్యక్తిగత లక్ష్యాలు అంటూ ఏమీ లేవని జాగృతి నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ అంతపురంలో జరిగే కుమ్ములాటలు రాజ్యానికి అసలు మంచివి కావు. ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా ఆ పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఇప్పటికే పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలు వచ్చాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో అధికార పార్టీకి సానుకూలమైన ఫలితాలు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలు కూడా గులాబీ పార్టీకి రాలేదు. అలాంటప్పుడు ఈ అంతర్గత కుమ్ములాటను ఏ స్థాయిలో కేసీఆర్ పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది.

## అక్కడి నుంచి కవిత పోటీ.. అజారుద్దీన్ కి కష్టమే!

**నిజామాబాద్ :** తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో భాగంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అయితే ప్రస్తుతం అజారుద్దీన్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాదు. మంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లో ఎమ్మెల్యే గానీ, ఎమ్మెల్సీ గానీ కావాలి. లేదంటే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఇటీవల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత కూడా పోటీకి సిద్ధమవుతోంది. కవిత రాజీనామాను గుత్తాసుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. కవిత స్థానం ఖాళీ కావడంతో, త్వరలోనే భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఇక్కడ తమ అభ్యర్థిని ఎంపిక చేసుకునేందుకు సంస్థాగత చర్యలు పూర్తి చేసినట్లు సమాచారం.ఖాళీ అయిన కవిత స్థానాన్ని మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు ఈ స్థానం ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నప్పటికీ, పరిస్థితుల వల్ల మంత్రి పదవి ఇచ్చి మచ్చిక చేసుకున్నారు.

# రాజేంద్రనగర్ నూతన డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ కు సన్మానం







**పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బహుజన ముక్తి పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జంపల్లీ శామల్ రాజ్**

**రాజేంద్రనగర్,జనవరి13(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ డీసీపీగా ఎస్.శ్రీనివాస్ నూతనంగా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉందని తెలంగాణ రాష్ట్ర బహుజన ముక్తి పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జంపల్లీ శామల్ రాజ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆయన సారధ్యంలో స్థానికంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగదని ఆశాభావం వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీసీపీ శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి శాలువాతో సన్మానించి పలు సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు.అనంతరం శామల్ రాజ్ మాట్లాడుతూ..సామాన్యుడు నిర్భయంగా కంటినిండా కునుకు తీయాలంటే అది పోలీసువారి వల్లనే సాధ్యమవుతుందన్నారు. రౌడీలు,గుండాలు,అక్రమార్కులు,దోపిడీదారుల భారీ నుంచి ప్రజలను కాపాడేది పోలీసులే అని,అలాంటి ఉత్తమ బాధ్యతాయుతమైన పోలీసు ఉన్నతాధికారిగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.సమాజంలో మహిళలపై అత్యచారాలు హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ముక్కు పచ్చలారని చిన్నారులను కూడా అత్యాచారాలు చేసి హత్యలు చేస్తున్న ఘోరాలు చూస్తున్నామని,అలాంటి మానవ మానవ మృగాల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరినట్లు వివరించారు.

## విపణిలోకి బ్రిటన్ మడ్డీఫాక్స్ సైకిళ్లు

**ముంబయి:** బ్రిటన్ సంస్థ మడ్డీఫాక్స్ 18 మోడళ్ల సైకిళ్లను దేశీయ విపణి లోకి విడుదల చేస్తున్నట్లు సోమవా రం ప్రకటించింది. రోమ్, క్రైలాన్ బైసైకిల్ బ్రాండ్లను కలిగి ఉన్న అనంత వెంచర్స్‌తో ఇందుకోసం ఒప్పందంపై సంతకం చేసినట్లు మడ్డీఫాక్స్ తెలిపింది. భారత్‌లో తమ ప్రత్యేక డిస్ట్రిబ్యూటర్‌గా అనంత వెంచర్స్ ఉంటుందని పేర్కొంది. 'ఐరోపాలో ప్రాచుర్యం పొందిన తాము, భారతీయ వినియోగదార్ల అవసరాలకు తగ్గట్లు మారేందుకు సిద్ధంగా ఉన్నామ'ని మడ్డీఫాక్స్ ఆసియా పసిఫిక్ ప్రాంత ఎండీ సాహిల్ మెహ్రోత్రా వెల్లడించారు. కంపెనీ ఉత్పత్తి శ్రేణిలో రోడ్లపై, పర్వత ప్రాంతాల్లో సైక్లింగ్‌కు తోడ్పడేవి, హైబ్రిడ్ బైక్‌లు ఉన్నాయి. మహిళలు-పిల్లల కోసం ప్రత్యేక బైక్‌లు ఉన్నాయని సంస్థ పేర్కొంది. 'ధరలు బేరీజు వేసుకునే వినియోగదార్ల కోసం మా వద్ద రోమ్, క్రైలాన్ బ్రాండ్లు ఉన్నాయి. అధిక-నాణ్యత, ప్రీమియం బ్రాండ్ ఉత్పత్తులు, గొప్ప రైడింగ్ అనుభూతి కోసం మడ్డీఫాక్స్ ఉత్పత్తులు లభిస్తాయని' అనంత వెంచర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ అజిత్ గాంధీ వెల్లడించారు.

## రిటెయిల్ ధరలు పెరుగుతున్నాయ్



**దిల్లీ:** ఆహార వస్తువుల ధరలు పెరగడంతో, 2025 డిసెంబరులో రిటెయిల్ ద్రవ్యోల్బణం మూడు నెలల గరిష్ఠమైన 1.33 శాతానికి పెరిగింది. గతేడాది అక్టోబరులో రికార్డు కనిష్ఠమైన 0.25%, నవంబరులో 0.71 శాతంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం నమోదైన సంగతి విదితమే. 2024 డిసెంబరులో మాత్రం ఇది 5.22 శాతంగా ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ఈ గణాంకాలను సోమవారం విడుదల చేసింది. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా లెక్కవేసే రిటెయిల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్ష్యిత 4% కంటే దిగువనే నమోదు కావడం విశేషం. డిసెంబరులో ఆహార ద్రవ్యోల్బణం -2.71 శాతంగా నమోదైంది. వరుసగా ఏడో నెలా ఆహార ద్రవ్యోల్బణం ప్రతికూలంగానే కొనసాగింది. కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, సుగంధ ద్రవ్యాలు, పప్పుల ధరలు పెరగడంతో, అక్టోబరు-నవంబరుతో పోలిస్తే, డిసెంబరులో ఆహార ద్రవ్యోల్బణం అధికమైంది. ద్రవ్యోల్బణం పట్టణ ప్రాంతాల్లో 2.03 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 0.76 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కేరళ (9.49%), కర్ణాటక (2.99%), ఆంధ్రప్రదేశ్ (2.71%), తమిళనాడు (2.67%), జమ్మూ కశ్మీర్ (2.26%) ఉన్నాయి. అస్సాం, బిహార్, హరియాణా, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్‌లో ప్రతి ద్రవ్యోల్బణం నమోదైంది.

## టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్ విడుదల

ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ పాసింజర్స్ వెహికల్స్.. టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర రూ.5.59 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. నేటి నుంచి (జనవరి 13) బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ సెగ్మెంట్‌లో హ్యుందాయ్ ఎక్స్‌టర్, నిస్సాన్ మాగ్నైట్, రెనో కైగర్, మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ వంటి కార్లతో ఇది పోటీ పడనుంది.టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్.. పంచ్.ఈవీని పోలి ఉంటుంది. కొత్త పంచ్‌లో ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్‌ను రీడిజైన్ చేశారు. డీఆర్ఎల్స్‌ను కొత్తగా తీర్చిదిద్దారు. స్పోర్టియర్ బంపర్స్, సరికొత్త అల్లాయ్ డిజైన్, కొత్త ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్ క్లస్టర్ ఆకట్టుకుంటాయి. ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్స్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్, రేర్ వాషర్ వైపర్స్‌ను ఇచ్చారు. కొత్తగా సైంటిఫిక్, కారామెల్, బెంగాల్ రూజ్, కూర్గ్ క్లౌడ్స్ వంటి కలర్ ఆప్షన్స్‌తో పంచ్ లభిస్తుంది.ఇంటీరియర్ పరంగానూ పలు మార్పులు చేశారు.

# చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

**రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ ముత్తుయాదవ్**



**రాజేంద్రనగర్,జనవరి13(సూర్యరేఖ)** సంక్రాంతి పండుగ సందర్భంగా ఎగురవేసే గాలిపటాలకు దుకాణదారులు నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ ముత్తుయాదవ్ హెచ్చరించారు. తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామ క్రిష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రాజేంద్రనగర్ లో యువకులకు గాలిపటాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్ పెక్టర్ ముత్తుయాదవ్ మాట్లాడుతూ...గుట్టు చప్పుడు కాకుండా పలుచోట్ల చైనా మాంజా విక్రయిస్తున్నారని దానివల్ల మనుషులకు జీవరాసులకు ప్రాణాపాయ స్థితి కలుగుతుందని అన్నారు.చైనా మాంజా ప్రమాదకరమని, దానిని విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పన్నారు. చైనా మాంజా విక్రయాలు, నిల్వ, వినియోగంపై కఠిన ఆంక్షలు విధించినట్లు తెలిపారు. పర్యావరణానికి ప్రాణాలకు ముప్పుగా మారిన చైనా మాంజాపై పూర్తిస్థాయిలో నిషేధం అమలులో ఉందని మనుషులు జంతువులు పక్షులకు నైలాన్ దారం వల్ల తీవ్రంగా గాయపడుతున్నట్లు,ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు.చైనా మాంజా పక్షులు,మానవజీవాల ప్రాణాలకు పెను ముప్పుగా మారిందన్నారు.చైనా మాంజా ఒక మారణ ఆయుధం అన్నారు.ద్విచక్ర వాహనదారులకు గొంతులు తెగుతున్నాయి, పాదాచారులు నడుచుకుంటూవెళుతున్న సమయంలో కాళ్లకు చిక్కుకొని కింద పడుతున్నారు.గాయాల పాలవుతున్నారన్నారు. యువకులు కుటుంబ సమేతంగా సంతోషంగా పండగ నిర్వహించుకోవాలి అని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో రైతులకు రాయితీ పండుగ

**రూ.30 లక్షల వ్యవసాయ పనిముట్లు పంపిణీ ఎమ్మెల్యే గడ్డం వినోద్,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి,జనవరి13 (సూర్యరేఖ)** బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అర్హులైన రైతులకు రాయితీపై అందించే వ్యవసాయ పనిముట్లను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ...వ్యవసాయశాఖ ద్వారా బెల్లంపల్లి, నియోజకవర్గానికి సుమారు రూ.30 లక్షల విలువైన రాయితీ మంజూరు కావడం ఎంతో ఆనందకరమని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అందిస్తున్న ఈ రాయితీలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో వ్యవసాయ రంగం రికార్డు స్థాయిలో అభివృద్ధి చెందిందని,రైతులకు అనుకూలమైన విధానాలతో సాగు రంగానికి కొత్త ఉత్సాహం లభించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నేడు దేశంలోనే తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ రంగంలో నంబర్ వన్‌గా నిలిచిందని గర్వంగా చెప్పుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు,వ్యవసాయశాఖ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏవైనా ఉంటే గవర్నమెంట్‌ను అడుక్కోండి.. నిలదీసిన ప్రజలతో మంత్రి వివేక్ దురుసు ప్రవర్తన



మంచిర్యాల జిల్లాలో మంత్రి వివేక్ వెంకటస్వామికి నిరసన సెగ తగిలింది. తమ ప్రాంత సమస్యలపై క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు మంత్రిని నిలదీశారు. ముఖ్యంగా రహదారి పనులు కూడా చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా ఒక్క అభివృద్ధి పని కూడా కనిపించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. స్థానికుల ప్రశ్నలతో మంత్రి వివేక్ వెంకటస్వామి తీవ్ర అసహనానికి గురయ్యారు. సమస్యలపై నిలదీసిన ప్రజలతోనే మంత్రి వివేక్‌తో పాటు డీసీసీ అధ్యక్షుడు రఘునాథ రెడ్డి దురుసుగా ప్రవర్తించారు. రహదారి అవసరమైతే ప్రభుత్వాన్ని అడుక్కోండంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. తమ సమస్యల గురించి వినకుండా, దురుసుగా వ్యవహరించారంటూ మంత్రి వివేక్ తీరుపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

## రామయంపేట మున్సిపల్ అక్రమాలపై విచారణ చేయాలి...

**వాహన,చెత్తబుట్టల కొనుగోళ్లలో కమిషనర్ చేతివాటం...**

**ప్రెస్ మీట్ లో మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ ఆరోపణ..**




**రామయంపేట,జనవరి13(సూర్యరేఖ) :** రామాయంపేట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జరిపిన అవినీతి అక్రమాలపై వెంటనే ప్రభుత్వం విచారణ చేపట్టాలని రామాయంపేట మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ డిమాండ్ చేశారు.ఉన్నతాధికారుల,ఎమ్మెల్యే స్థాయి విచారణ జరగాలనీ,లేదంటే పక్షం రోజుల్లో మున్సిపల్ ను ముట్టడిస్తామని,అవసరమైతే పట్టణ బందుకు పిలుపునిస్తామని బిఆర్ఎస్ నేత పల్లె జితేందర్ గౌడ్ హెచ్చరించారు.మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామాయంపేట మున్సిపల్ లో కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపించారు.వాహన,చెత్తబుట్టల కొనుగోళ్ళలో అవినీతి జరిగిందన్నారు.పారిశుద్ధ్యనికి వాడే వాహనాల్లోనూ డీజిల్ విషయంలో అవకతవకులు ఉన్నట్లు ఆయన తెలిపారు.అంతేకాదు నెలలో పక్షం రోజులు కూడా విధులకు రాకుండా కమిషనర్ డుమ్మాకొడుతూ వేతనాలు మాత్రం సక్రమంగా పొందటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.అలాగే పట్టణంలో వాడిన బ్లీచింగ్ పౌడర్ ను కొంత లెక్కల్లో చూపించి కొండంత..!! చేసినట్లు చూపెట్టడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమంటూ విమర్శించారు.మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి,అక్రమాలపై ఉన్నత స్థాయి అధికారుల విచారణతో పాటు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేదంటూ కాలయాపన చేస్తే పక్షం రోజుల వ్యవధిలో మున్సిపల్ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు.అవసరమైతే రామాయంపేట బందుకు సైతం పిలుపునిస్తామంటూ ధ్వజమెత్తారు.ఈ సమావేశంలో సొసైటీ మాజీ చైర్మన్ బాదే చంద్రం,బిఆర్ఎస్ నాయకులు అహ్మద్, హస్నోద్దీన్, ఉమా కృష్ణ (కేకే)చింతల రాములు,పాతూరి సాయి,మద్దెల రమేష్,చింతల రాములుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మహిళా సాధికారితకు ప్రోత్సాహం : ఆకుల వెంకటేశ్

**తాండూర్, జనవరి 13 :** మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేశ్, ఏపీఎం శ్యామల అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధి రేపల్లెవాడ గ్రామంలో అభినయ గ్రామ సంఘం వారికి పెరటి కోళ్ల పెంపకం పథకం ద్వారా మంజూరైన 26 యూనిట్స్ కోళ్లను గ్రూప్ సభ్యులకు అందజేయడం జరిగింది. ఒక కోడికి రూ.130 చొప్పున సబ్సిడీ ద్వారా అందించినట్లు వారు తెలిపారు. అవి పెరిగి పెద్దగా అయిన తర్వాత వాటి అమ్మకం ద్వారా వచ్చిన లాభాలను సభ్యులందరూ పొందిన తర్వాత సబ్సిడీ కింద ఇచ్చిన కోళ్లకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలానికి మొత్తం 250 యూనిట్స్ రావడం జరిగిందని ఏపీఎం తెలిపారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పై వచ్చే పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా మరింత ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొల్లూరి సంగీత, సీసీ రాజేశ్వరి, వీవీఏ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న సాగు భళా.. మద్దతు ధర దక్కదేమోనని రైతు ఆందోళన..!



**కుభీర్ :** అన్నం పెట్టే రైతన్నకు సున్నం పెట్టినట్లుగా ఉంది రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం. ఆరుగాలం రెక్కలను ముక్కలు చేసుకుని కష్టించి పండించిన పంటకు మద్దతు ధర లభించక, పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్ట పోతున్న రైతన్నలకు భరోసా లేకుండా పోయింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి కారణంగా ప్రధాన పంటలైన సోయా, పత్తి దెబ్బతిని సగానికి సగం దిగుబడులు తగ్గిపోయాయి. వచ్చిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొర్రీలు పెట్టి 25% సోయాబీన్ కూడా కొనుగోలు చేయలేదు. దాంతో రైతులు దళారులకు, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు పంటను అమ్ముకున్నారు. పీకల్లోతూ కష్టాల్లో మునిగిపోయారు. ఫలితంగా యాసంగిలోనైనా పత్తి, సోయాకు బదులుగా మొక్కజొన్న సాగుచేసి కొంతలో కొంతైనా నష్టాన్ని పూడ్చుకొందామని మండలంలోని రైతులు భావించారు. అనుకున్నట్లుగానే గత ఏడాది యాసంగి కంటే ఈ ఏడు యాసంగిలో మొక్కజొన్నను దాదాపు రెట్టింపు సాగుచేశారు. నిరుడు 9 వేల పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్న సాగవగా.. ఈ ఏడు 13 వేల ఎకరాల్లో సాగు జరిగింది. జనవరి చివరి వారం నుండి మొక్క జొన్న కోతకు రానుంది. ఈ తరుణంలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మొక్కజొన్నకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో గిట్టుబాటు అవుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం పంటలు సాగుచేసిన రైతాంగాన్ని ఆగం పట్టిస్తోంది. సోయా పంటను కొంటామని చెప్పి రంగు మారిందని, తేమ ఉందని, జల్లెడ పేరిట సవాలక్ష ఆంక్షలు విధించి కేవలం 40, 50 శాతం మాత్రమే కొనుగోలు చేసి రైతులను నష్టాల్లోకి నెట్టారు. మొక్కకొన్న చేతికొచ్చిన తర్వాత అదే పరిస్థితి పునరావృతం అవుతుందేమోనన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. మొక్కజొన్నకు కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ రూ. 2400 ప్రకటించినప్పటికీ.. పంట చేతికొచ్చేలోపు కొనుగోలు కేంద్రాలను తెరిచి సకాలంలో కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది మార్చిలో ప్రైవేటులో క్వింటా మక్కలకు రూ.18,00 నుంచి 2,100 చెల్లించారు. ఈ సారి మద్దతు ధర కంటే ఎక్కువగా క్వింటా మక్కలకు కనీసం రూ.2600 లభిస్తే కొంతలో కొంతైనా నష్టాలను పూడ్చుకోవచ్చంటున్నారు రైతులు. ప్రభుత్వం నెలరోజుల ముందే మండలంలో కనీసం 4 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేయాలని మండల రైతాంగం కోరుకుంటోంది.

# ఉప్పల్ లో గృహ జ్యోతి పథకం ద్వారా లక్షా కుటుంబాలు లబ్ది

## ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి

### చిలుకానగర్ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి సంక్రాంతి గ్రీటింగ్స్..

**ఉప్పల్,జనవరి13** (సూర్యరేఖ)ఉప్పల్ నియోజకవర్గంలో గృహజ్యోతి పథకం ద్వారా లక్ష కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని,ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. మంగళవారం ఉప్పల్ సర్కిల్ లోని చిలుకానగర్ లో మంగళవారం పరమేశ్వర్ రెడ్డి డిప్యూటీ సీఎం విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నుంచి వచ్చిన నూతన సంవత్సర,సంక్రాంతి గ్రీటింగ్స్ ను గృహ జ్యోతి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గృహ జ్యోతి పథకానికి అర్హులై ఉండి నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ ను వినియోగించిన పేద, మధ్య తరగతి ప్రజలకు జీరో బిల్లు కింద ఉచితంగానే విద్యుత్ సరఫరా చేస్తున్నట్లుగా ఈ సందర్భంగా





పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.ఇదే తరహాలో ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కూడా రేవంత్ రెడ్డి సర్కార్ కల్పించిందన్నారు.చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కూడా సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు.కార్యక్రమంలో ఏ.డి.ఈ.రవీందర్ రెడ్డి,చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు రాజేష్ ముదిరాజ్,ఏ.ఈ వేణుగోపాల్,ఎల్.ఐ.అమర్ సింగ్,ఆకిటి ఆగంరెడ్డి,కొంపల్లి బాలరాజ్ ముదిరాజ్,మహేందర్ ముదిరాజ్ అమరేశ్వరి సుశీల,మంచాల రఘు,అమర్ రాధాకృష్ణ గండికోట గణేశ్,శంకర్,జగదీష్ ముదిరాజ్ సోనుగౌడ్ తూర్పాటి జంగయ్య,కిరణ్ శివ సుదర్శన్,మొయినుద్దీన్,గడ్డం శ్రీను ఆంజనేయులు యాదగిరియాదవ్,వంశి,సత్యం రవితే ఉదయ్ ఈశ్వరి సంధ్యసంధ్య,శోభారెడ్డి సమంత రంగమ్మ,సుమలత సంతోష్,విజయ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఎం.పీ.ఈటల రాజేందర్ నిధులతో ఆర్టీసీ కాలనీలో రూ.35 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు





**పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు**

**ఉప్పల్,జనవరి13** (సూర్యరేఖ)రామంతపూర్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో రూ.35 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు పరిశీలించారు.మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కోటా కింద మంజూరైన రూ.35 లక్షలతో ఆర్టీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా మంగళవారం కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి పనుల పురోగతిని పరిశీలించారు.రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు ఎలాంటి లోపాలు తలెత్తకుండా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు.స్థానిక ప్రజలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు పనులు సక్రమంగా జరిగేలా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణము అయిన తర్వాత రోడ్డు క్యూరింగ్ సక్రమంగా జరిగేలా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు.రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ కు కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏ.ఈ.శ్వేత,వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి,బీజేపీ నాయకులు నాసు సతీష్ నర్సింగరావు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న నిర్లక్ష్యంతో కుటుంబాన్ని శోకసముద్రంలో ముంచుతుంది

### కళ్లకు కట్టినట్లుగా బాధను వివరించిన తల్లిదండ్రులు..

### ప్రతి కుటుంబం ఆనందంతో జీవించాలి.....జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు








**కొల్చారం,జనవరి13(సూర్యరేఖ)**దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా “ఎరైవ్ అలీవ్”(అరైవ్ అలైవ్)అనే వినూతన అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో ఘనంగా ప్రారంభమైంది. జనవరి 13నుండి 24వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్లో భాగంగా,తొలి రోజు కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతశీ శెట్టిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాన్ని గ్రామస్తులకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. హెల్మెట్ ధరించడం ప్రాణాలకు రక్షణ కవచం లాంటిదని, అందువల్ల ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు, ఫోర్ వీలర్ వాహనదారులు సీటు బెల్టు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అతివేగం,నిర్లక్ష్యం,మద్యం సేవించి వాహనాలు నడపడం,హెల్మెట్ మరియు సీటు బెల్టు వినియోగించకపోవడం వంటి కారణాల వల్ల జరుగుతున్నాయని తెలిపారు. “ఎరైవ్ అలీవ్” కార్యక్రమం ద్వారా ప్రతి వ్యక్తిలో బాధ్యతాయుతమైన వాహన వినియోగంపై అవగాహన పెంపొందించి, ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నినాదంగా మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో ఒక ఉద్యమంలా కొనసాగాలని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా,అదే గ్రామానికి చెందిన 25సంవత్సరాల యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటనను ఆయన తల్లిదండ్రులు భావోద్వేగంతో వివరిస్తూ,ఆ విషాదాన్ని కళ్లకు కట్టినట్లుగా గ్రామస్తులకు తెలియజేశారు.ఈ సంఘటన అక్కడి వారందరినీ చలింపజేసి,రోడ్డు భద్రత యొక్క ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేసింది. చివరగా గ్రామస్థులతో రోడ్డు భద్రత పై ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, మెదక్ రూరల్ సీఐ జార్జ్,ఏఎంవీఐ శ్రీనివాసరావు కొల్చారం ఎస్సైఅహమ్మద్ మోహినొద్దీన్,గ్రామ సర్పంచ్ దయాకర్ గౌడ్,ఉపసర్పంచ్ గుండు నాని,గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి,చిన్న ఘనపూర్ గ్రామ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి,కోనాపూర్ సంతోష్ రావు, వివిధ పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ యువసేన సంఘం ఆధ్వర్యంలో మహాసదస్సు..

**తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దిశెట్టి సామేలు**



**ఖమ్మం,జనవరి13(సూర్యరేఖ)** ఆంధ్రప్రదేశ్లోని బెంజ్ సర్కిల్ భారతీయ యువసేవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో కృష్ణాజిల్లా గుడివాడ నియోజక వర్గానికి చెందిన బిజెపి నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈనెల 25వ తారీకు ఆంధ్రప్రదేశ్లో భారతీయ యువసేవ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సుకు పెద్ద ఎత్తున ప్రజల హాజరు కావాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మహిళా మోర్చా నాయకులు మండల అధ్యక్షులు బిజెపికి సంబంధించిన వారు వారితో పాటు పలగాని శ్రీనివాస్ గౌడ్ హాజరవునారు.

## గుర్తుతెలియని మహిళ శవం లభ్యం..

**కొల్చారం,జనవరి13(సూర్యరేఖ)** మెదక్ జిల్లా కొల్చారం మండలం మంగళవారం ఉదయం వచ్చిన సమాచారం ప్రకారం..కొల్చారం మండలం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సీ) వెనుక భాగంలో చింతల కిష్టయ్య భూమి పక్కనే ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ కాలువ వద్ద ఒక గుర్తు తెలియని ఆడ వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయిన స్థితిలో ఎముకలు మాత్రమే మిగిలి ఉన్నట్లు గుర్తించామని కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మొహీన్ యుద్దీన్ తెలిపారు మృతురాలి వయసు సుమారుగా 45నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండవచ్చునని ఎస్సై తెలిపారు. మృతదేహ స్థితిని బట్టి ఆమహిళ సుమారుగా 15 రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చునని తెలిపారు.ఈ మృతదేహాన్ని ఎవరైనా గుర్తుపట్టినట్లయితే క్రింద సూచించిన అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కొల్చారం ఎస్ఐ సెల్ 8712657919,సిఐ 8712657916 నంబర్ కు సమాచారం అందించాలని కోరారు.



## ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,జనవరి13** (సూర్యరేఖ)ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి17 మంది విద్యార్థులకు దాదాపు రూ.7లక్ష చెక్కులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...విద్యే భవిష్యత్తుకు బాటలు వేసే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు.పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన ప్రతిభావంతమైన విద్యార్థులకు బిఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తుందని ఆయన అన్నారు.వైద్య విద్య అభ్యసిస్తూ భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్,మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వరరావు,మేకల మధుసూదన్ రెడ్డి,విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, స్థానిక నాయకులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులు బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ధన్వాడ పెద్ద చెరువు నుంచి నీటి విడుదల..

**ధన్వాడ,జనవరి13(సూర్యరేఖ)** మండల కేంద్రమైన ధన్వాడ పెద్ద చెరువు నుంచి పంట పొలాలకు నీటిని విడుదల చేశారు.ప్రత్యేక పూజలు నిర్వహించి తూము నుంచి చెరువు కింద ఉన్న పొలాలకు యాసంగి పండుగను నీటిని విడుదల చేశారు.ఇరిగేషన్,రెవిన్యూ అధికారులు నీటిని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు కందూరు శ్రీనివాస్ రెడ్డి,వెంకట్ రెడ్డి,ముసిరిగారి నర్సింలు, సాకలి కొండప్ప,సాకలి నరసింహులుతో పాటుగా పలువురు పాల్గొన్నారు.



# స్వామి వివేకానంద వంటి మనీషి యుగానికి ఒకరే పుడతారు





**నాంపల్లి,హైదరాబాద్,జనవరి13(సూర్యరేఖ)** గుడిమల్కాపూర్ లోని న్యూసత్యనారాయణనగర్ లో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ప్రోగ్రామ్ కన్వీనర్ డిజ్వర్ సింగ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163వ జయంతి కార్యక్రమం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనత పార్టీ గోల్కొండ జిల్ల ప్రదాన కార్యదర్శులు పడాల అనంత కృష్ణ, ఆర్ఎస్ఎస్ కార్వాన్ నగర్ కార్యవాహ్ శ్రీనివాస్ చక్రవర్తి,ఆర్ఎస్ఎస్ సంఘ్ సీనియర్ స్వయం సేవక్ రాజేశ్వర్ జీ,బీజేపీ నేతలు హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేన రెడ్డి,కట్ట నర్సింగ్,శివ యాదవ్,ఉప్పరి పాండు కళ్యాణి ఆకుల గోవర్ధన్ కరుణ జగదీష్ లష్మినారాయణ బలవీర్ సింగ్,సురేందర్ సింగ్ తదితరులు పాల్గొని స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ. స్వామి వివేకానంద వంటి మనీషి యుగానికి ఒకరే పుడతారని అన్నారు. వివేకానందుడు గొప్ప తాత్వికుడని,అతని ముఖ్య బోధనల ప్రకారం అద్వైత వేదాంతం తత్త్వ శాస్త్రములోనే కాకుండా సామాజికంగా రాజకీయంగా కూడా ఉపయోగ పడుతుందని రామకృష్ణుడు నేర్పిన ముఖ్యమైన పాఠాలలో జీవుడే దేవుడు'అనేది అతని మంత్రముగా మారిందన్నారు.యువత స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలని పలువురు పేర్కొన్నారు.

## బండి లింగమ్మ కుటుంబానికి నేతల పరామర్శ




**బెల్లంపల్లి,జనవరి13(సూర్యరేఖ)** బండి రాజ్‌కుమార్ యాదవ్,బండి తిరుపతి యాదవ్‌ల తల్లి బండి లింగమ్మ ఈనెల 4న మృతి చెందారు.ఈ సందర్భంగా బండి రాజ్‌కుమార్ యాదవ్,బండి తిరుపతి యాదవ్ నివాసానికి నేతలు వెళ్లి,లింగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వెనుకబడిన వర్గాల ఉపాధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్,కు శాసనసభ్యుల వ్యక్తిగత సహాయకుడు ప్రసాద్ కాంగ్రెస్ నాయకులు పరమేశ్వర్,సలీం,ఇంతియాజ్,ఖలీల్ హాజరై కుటుంబానికి ధైర్యం చెప్పారు.

## కన్నాల సర్పంచ్ నాతరి మల్లమ్మకు ఘన సన్మానం..




**బెల్లంపల్లి,జనవరి13(సూర్యరేఖ )** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందిన నాతరి మల్లమ్మను బెల్లంపల్లి బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ చేను రవికుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చేను రవికుమార్ మాట్లాడుతూ...ప్రజలతో మల్లమ్మకు ఉన్న సత్సంబంధాలు,గ్రామ అభివృద్ధికి ఆమె చూపుతున్న నిబద్ధతను గుర్తించిన ప్రజలు ఆమెను అత్యధిక మెజార్టీతో గెలిపించారని తెలిపారు.మల్లమ్మ హయాంలో కన్నాల గ్రామపంచాయతీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, రిపోర్టర్ పసుపులేటి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలను పరిష్కరిస్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,జనవరి13 (సూర్యరేఖ)** రాష్ట్రంలో విద్యారంగ,ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా,బి.సి.వెల్ఫేర్ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం టీఎస్టియు రాష్ట్ర సంఘం-2026 సంవత్సరం నూతన డైరీని ఆవిష్కరించిన అనంతరం సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ అబ్దుల్లా,చందూరి రాజిరెడ్డిలు లేవనెత్తిన పలు సమస్యలపై మంత్రి మాట్లాడుతూ...317జీ.వో.ద్వారా నష్టపోయిన ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల, స్పౌజ్ టీచర్ల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని, ఆర్థికంగా ప్రభుత్వం మెరుగైన స్థితికి చేరుకోగానే పెండింగ్ లో ఉన్న 4.డి.ఎలను,పిఆర్సి అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని హామీ ఇచ్చారు. 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు.మధ్యాహ్న భోజనానికి ప్రస్తుతం చెల్లిస్తున్న రేట్లను పెరిగిన ధరలను అనుసరించి పెంచాలని టి ఎస్టియు ఈ నాయకులు ఈ సందర్భంగా మంత్రిని కోరగా అన్ని అంశాలు ముఖ్యమంత్రికి నివేదిస్తానని అన్నారు.ఈ కార్యకమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ అబ్దుల్లా,చందూరి రాజి రెడ్డి,టీఎస్ టియు రాష్ట్ర బాధ్యులు అప్సర్ అహ్మద్, హెచ్.శ్రీనివాసరెడ్డి, సయ్యద్ రహమతుల్లా. కె.సత్యనారాయణ హైదరాబాద్ జిల్లా బాధ్యులు మహమ్మద్ ఇక్బాల్, అఫీస్,జావేద్, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలమ దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

# చైనా మాంజా విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు

ధన్వాడ ఎస్సై రాజశేఖర్



**ధన్వాడ,జనవరి13 (సూర్యరేఖ)** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు ధన్వాడ మండల కేంద్రంలో చైనా మాంజా విక్రయాలను అరికట్టేందుకు ధన్వాడ ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో ధన్వాడ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వివిధ పతంగులు (గాలిపటాలు) అమ్మే షాపులలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి,చైనా మాంజా నిల్వలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించారు.చైనా మాంజా వల్ల మనుషులకు, ముఖ్యంగా చిన్నారులకు,వాహనదారులకు, పక్షులకు తీవ్ర ప్రమాదం వాటిల్లే అవకాశముందని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.చైనా మాంజా విక్రయాలు, నిల్వలు,వినియోగం పూర్తిగా నిషేధించబడినవని స్పష్టం చేస్తూ,నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా అమ్మినట్లయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వివిధ షాపుల యాజమానులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ హెచ్చరించారు.వ్యాపారులు ఎలాంటి నిషేధిత వస్తువులను విక్రయించకుండా సహకరించాలని సూచించారు.భవిష్యత్తులో కూడా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని ఎక్కడైనా చైనా మాంజ విక్రయిస్తే అట్టి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఎస్సైరాజశేఖర్ విజ్ఞప్తి చేశారు.

# పైప్లైన్ వేయించిన మాజీ కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్.



**కామారెడ్డి,జనవరి13(సూర్యరేఖ)** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు సరంపల్లి గ్రామంలో అమృత్ స్కీంద్వారా పైపులైను లేని గల్లీలలో మాజీ కౌన్సిలర్ ఆకుల రూపరవికుమార్ దగ్గరుండి పైప్లైన్ వేయించారు.త్రాగునీటి కోసం పైప్ లైన్ వేయించిన మాజీ కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్ కాలనీ వాసులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కొత్తూరు పెద్దసాయిలు, గొడుగు శ్రీనివాస్,అంజన్ కుమార్ మామిండ్ల అశోక్,గుడిసె గోపి కాలనీవాసులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల కాటుతో మరణిస్తే రాష్ట్రం భారీ పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది..

గున్నాల రంగారెడ్డి



**నాంపల్లి,హైదరాబాద్, జనవరి13 (సూర్యరేఖ)** వీధి కుక్కల కాటుతో మరణిస్తే రాష్ట్రాలు భారీ పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసిందని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గున్నాల రంగారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా గున్నాల రంగారెడ్డి మాట్లాడుతూ..చట్టబద్ధ నిబంధనల అమలే తమ లక్ష్యమని న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ చెప్పిన్నారని అన్నారు.వీధి కుక్కల కాటుతో ప్రజలు మరణిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు ముడుచుకుని కూర్చుంటే కఠిన చర్యలు తప్పవని అయన హెచ్చరించారని తెలిపారు.కుక్కలకు ఆహారం పెట్టేవారికీ బాధ్యత ఉంటుందని తేల్చి చెప్పారు.ఇది కోర్టు విచారణ అని,ప్రజా వేదిక కాదని బెంచ్ తీవ్ర వ్యాఖ్యలు చేసింది.ప్రతి కాటు,ప్రతి మరణానికి రాష్ట్రాలే జవాబుదారులని స్పష్టం చేసిందన్నారు.కాటు ఘటనలు పునరావృతమైతే అది పరిపాలనా నిర్లక్ష్యం మాత్రమే కాదని వ్యవస్థాపక వైఫల్యమే నని కోర్టు వ్యాఖ్యానించిందన్నారు.

## ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు..



**రాజేంద్రనగర్,జనవరి13 (సూర్యరేఖ)** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అఖిల భారత ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గణేష్ నగర్ లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో యువతులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల రంగవల్లులు వేశారు.పోటీలలో విజయం సాధించిన వారికి మెమొటోలు, సర్టిఫికెట్లు బహుమతులుగా అందజేశారు.టింగ్లికార్ లహరిక ,హిరేకార్ సంజన టింగ్లికార్ శరణ్య,మల్తుంకార్ విష్ణుప్రియ,హిరేకార్ లోకేశ్వరి,హిరేకార్ వర్షిత,హిరేకాదు భవ్యశ్రీ,లు బహుమతులు పొందారు.కార్యక్రమంలో మురరికార్ ప్రశాంత్,డాక్టర్ అండేకార్ శ్రీనివాస్,డాక్టర్ మల్లెకిడికార్ మురళి,నడికుడేకార్ రాజేంద్రప్రసాద్, హరీష్ నాగేశ్వరావు,శంకర్ బాబులాల్,హిరేకార్ నాగేశ్వర్ రావు,వాన్ కార్ బాబులాల్,తదితరులు పాల్గొన్నారు.

## ఆరెకటికల కులదేవతల జాతర కరపత్రం విడుదల..



**రాజేంద్రనగర్,జనవరి13 (సూర్యరేఖ)** అనంతపూర్ జిల్లా గుత్తి పట్టణంలో వెలసిన ఆరెకటికల కులదైవాలైన శ్రీసునామ జకినీమాత,శ్రీ మల్కామ జకినీ మాత అమ్మవార్ల జాతర 23వ వార్షికోత్సవ కరపత్రాన్ని మంగళవారం గణేష్ నగర్ లో ఆసంఘం నాయకులు ఆవిష్కరించారు. జనవరి 29,30తేదీలలో జరిగే జాతరకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర,కర్ణాటక రాష్ట్రాల నుంచి ఆరె కటికల తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మురరికార్ ప్రశాంత్,డాక్టర్ అండేకార్ శ్రీనివాస్,డాక్టర్ మల్లెకిడికార్ మురళి,నడికుడేకార్ రాజేంద్రప్రసాద్,హరీష్ నాగేశ్వరావు,శంకర్ బాబులాల్,హిరేకార్ నాగేశ్వర్ రావు,వాన్ కార్ బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

## గృహ జ్యోతి లబ్ధిదారులకు బాండ్ పేపర్ల పంపిణీ..



**నిజాంపేట,జనవరి13(సూర్యరేఖ)**మండల పరిధిలోని నగరం,రాంపూర్ గ్రామాలలో మంగళవారం గృహ జ్యోతికి సంబంధించి లబ్ధిదారులకు బాండు కాగితాలను అందజేశామని గ్రామ కార్యదర్శి హరిఫ్ హుస్సేన్ అన్నారు.ఈ కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ ప్రవీణ్,నగరం ఉప సర్పంచ్ గుగ్లోత్ నాజం,లైన్ మెన్ సుశాంత్,గుగ్లోత్ దేవేందర్,రవి ఉప్పలయ్య,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మౌలాలికి మరో అరుదైన "ప్రైడ్ ఆఫ్ భారత రత్న" అవార్డు









**ఖమ్మం,జనవరి13(సూర్యరేఖ)**విద్యారంగంలో వినూత్న బోధనా పద్ధతులు అవలంబిస్తూ,సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న మౌలాలి మరో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జి.సిఎస్ వల్లూరి ఫౌండేషన్ వారు నిర్వహించిన కార్యక్రమంలో మౌలాలికి "ప్రైడ్ ఆఫ్ భారత రత్న"అవార్డును ఘనంగా ప్రదానం చేశారు.ఈ కార్యక్రమం మానవ హక్కుల స్థాపనకు 77 సంవత్సరాలు పూర్తయిన సందర్భం మరియు స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని నిర్వహించబడింది.గణిత బోధనలో నూతన ఆలోచనలు,సులభమైన బోధనా పద్ధతులు అమలు చేస్తూ,ప్రత్యేకంగా మ్యాథ్స్ ల్యాబ్ ఏర్పాటు చేసి, విద్యార్థులలో గణితం పట్ల ఉన్న భయాన్ని తొలగించి,గణితాభ్యాసంపై ఆసక్తిని పెంపొందించినందుకు మౌలాలి సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.అదే విధంగా విద్యతో పాటు భక్తి,సేవా భావం ఆధ్యాత్మికత సామాజిక సేవ, ఆరోగ్య సంరక్షణ (హెల్త్ కేర్)వంటి అంశాలపై సమాజంలో అవగాహన కల్పిస్తూ చేస్తున్న నిరంతర సేవలు కూడా ఈ గౌరవానికి ప్రధాన కారణంగా నిలిచాయి.ఈ ప్రతిష్టాత్మక అవార్డును కేంద్ర ప్రభుత్వ మాజీ మంత్రి శ్రీసముద్రాల వేణుగోపాలచారి, తెలంగాణ సినిమా చాంబర్ చైర్మన్ పి.రామకృష్ణగౌడ్, జిసిఎస్ వల్లూరి ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ శ్రీనివాస రాజు దైవజ్ఞ శర్మ కలిసి మౌలాలి చేతికి అందజేశారు.ఈ సందర్భంగా మౌలాలిని విద్యార్థులు, తల్లిదండ్రులు సహోద్యోగులు,అలాగే పెరువంచ గ్రామ సర్పంచ్ శ్రీమతి కీసర నిర్మల మోహన్ రెడ్డి హృదయపూర్వకంగా అభినందించారు.మౌలాలి సేవలు భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని పలువురు ప్రశంసించారు.

## మెక్ జిల్లా ప్రజలకు భోగి,మకర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన..మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**మెదక్,జనవరి13(సూర్యరేఖ)** మెదక్ జిల్లా ప్రజలకు భోగి,మకర సంక్రాంతి,కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... హిందువులు జరుపుకునే పండుగల్లో అతి పెద్ద పండగ సంక్రాంతి అని,ఈ పండగ ను,మొదటి రోజు భోగి,రెండవ రోజు సంక్రాంతి,మూడవ రోజు కనుమగా మూడు రోజులు జరుపుకుంటారని తెలిపారు. పేద,ధనిక తారతమ్యాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయా లని ఈ సందర్భంగా కలెక్టర్ అభిలషించారు.ప్రతి కుటుంబం భోగి భాగ్యాలతో వెలుగొందాలని,భోగి మంటలు, వెచ్చటి వెలుగులు,పరి పూర్ణ మైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని,మకర సంక్రాంతి కాంతులతో ప్రతి ఇల్లు సంక్షేమ,సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని,కనుమ కాంతులతో పల్లె సీమలు, పశు సంవద,వ్యవసాయ,ఉద్యాన పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## చుక్కల దుప్పిని చంపిన ఇద్దరికి రిమాండ్..



**చెన్నూర్,జనవరి 13(సూర్యరేఖ)** భీమారానికి చెందిన అజ్మీర పున్నం,పెనుకుల రమేశ్లకు అటవీ వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.వీరు ఈనెల 9వ తేదీన భీమారం మాంతమ్మ గుడి సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్లో కాంప్ట్ నెంబర్ 66,పోతనపల్లి బీట్లో అక్రమంగా బెండింగ్ వైర్ సహాయంతో విద్యుత్ ఉచ్చులను అమర్చి చుక్కల దుప్పిని కరెంట్ షాక్తో చంపారు. అనంతరం చుక్కల దుప్పి మాంసాన్ని విక్రయించారు.

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ఎన్సిపి,పార్టీ ఎన్డీఏ కూటమి మద్దిశెట్టి సామేలు



**ఖమ్మం,జనవరి13(సూర్యరేఖ)** జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసినట్లు ఎన్సిపి,పార్టీ ఎన్డీఏ కూటమికి చెందిన మద్దిశెట్టి సామేలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం,ఖమ్మం, వరంగల్ మహబూబాబాద్ జిల్లాలకు చెందిన మొత్తం 46 మండలాల్లో గిరిజనులు,బహుజనులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా పక్కాఇళ్లు, సీసీ రోడ్లు,డ్రైనేజీలు మంచినీరు,కరెంటు సౌకర్యం, అంగన్వాడీ కేంద్రాలు పలు సమస్యలు మీద జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ అంశాలపై స్పందించిన జాతీయ ఎస్టీ కమిషన్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 17 మండలాలకు సంబంధించిన మద్దిశెట్టి సామేలు సమర్పించిన పిటిషన్పై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవ నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ కి అధికారికంగా లేఖను ఫార్వర్డ్ చేసినట్లు తెలిపారు.గిరిజనుల హక్కుల పరిరక్షణకు సానుకూలంగా స్పందించిన జాతీయ ఎస్టీ కమిషన్కు,ముఖ్యంగా కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ కి, గిరిజన బిడ్డలు,బహుజనుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మద్దిశెట్టి సామేలు అన్నారు.

## సమ్మక్కసారక్క జాతరలోని దుకాణాలకు ఈనెల 17న వేలం పాట



**మందమర్రి,జనవరి13,(సూర్యరేఖ)** ఏరియాలోని ఆర్కే1ఎ పాలవాగు వద్ద ఈ నెల28 నుండి 31వ తారీఖు వరకు నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతరలో వివిధ దుకాణాలను పెట్టుకోదలచిన వారు ఈ నెల17వ తారీఖు గురువారం ఉదయం 10 గంటలకు మందమర్రి పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయ ఆవరణలో నిర్వహించే వేలంపాటలో పాల్గొని దుకాణాలను దక్కించుకోగలరని సింగరేణి యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.ఇట్టి జాతరలో కొబ్బరి కాయలు,వెహికిల్ పార్కింగ్, బెల్లం తూకాలు కళ్యాణ కట్ట(తలనీలాలు)ఇతర దుకాణాలను ఏర్పాటు చేయదలచిన ఉత్సాహవంతులైన వ్యాపారస్తులు,ప్రజలు వేలంపాటలో పాల్గొని దుకాణాలను సొంతం చేసుకోవాలని యాజమాన్యం కోరింది. ఔత్సాహికులు ధరవత్ రూ 1,000 చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని,ధరవత్ (డిపాజిట్ )పైకం తిరిగి చెల్లించబడదని సింగరేణి యజమాన్యం స్పష్టం చేసింది.

## దివంగత దేవర కరుణాకర్ కార్వాన్ ప్రజలకు విశిష్టమైన సేవలు అందించి,ఒక మార్గదర్శకమైన వ్యవస్థ నిర్మాణం



**నాంపల్లి,హైదరాబాద్,జనవరి13(సూర్యరేఖ)** గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోని తాళగడ్డ జ్యోతి రావు పూలె విగ్రహం సర్కిల్ లో భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత,మాజీ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ మూడవ వర్ధంతి కార్యక్రమం ప్రముఖన్యాయవాది మురళీ కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత దేవర శ్రీనివాస్ పాల్గొని నివాళులు అర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ. మాజీ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ కార్వాన్ ప్రజలకు,బడుగు బలహీన వర్గాలకు విశిష్టమైన సేవలు అందించి,ఒక మార్గదర్శకమైన వ్యవస్థ కోసం దేవర కరుణాకర్ కృషి చేశారని వివిధ పార్టీల నేతలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుషాల్ సింగ్,అశోక్ కుమార్ యాదవ్,అనిల్ కుమార్, నాగరాజు,అశోక్ కట్ల,వెంకటేష్ సాగర్, గంగాధర్,శ్రీనివాస్,దేవర విద్యాసాగర్, శ్రీకాంత్ సాగర్ తదితరులు పాల్గొని దేవర కరుణాకర్ స్థానిక కాలనీల అభివృద్ధి కోసం విశేషమైన కృషి చేశారని కొనియాడుతూ నివాళులు అర్పించారు.

## అంగరంగ వైభవంగా గోదాదేవి రంగనాయకుల కళ్యాణ మహోత్సవం..



**నిజాంపేట,జనవరి13(సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీతిరుమల నాథస్వామి ఆలయంలో మంగళవారం గోదాదేవి రంగనాయకిల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పురోహితులు వెంకట రామ్మోహన్ శర్మ మాట్లాడుతూ...తిరుమల స్వామి ఆలయంలో అత్యంత వైభవపేతంగా గోదాదేవి రంగనాయకుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించామన్నారు.ఈ కళ్యాణ మహోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామివారి కృపకు పాత్రులు అయ్యారని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం సనాతన ధర్మానికి ఎంతో ఉపయోగపడతాయని.ఆ స్వామివారి కృప మండల గ్రామ ప్రజలపై ఉండాలన్నారు. అనంతరం ఆలయ,అన్నదాన వితరణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మండల ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అలాగే గోదాదేవి కళ్యాణ మహోత్సవంలో స్థానిక ఎస్ఐ రాజేష్ పాల్గొని రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ ఈకార్యక్రమంలో ఆలయ ఏవో రవికుమార్,ముత్యంరెడ్డి,ఆలయ చైర్మన్ అక్కల రాంరెడ్డి,డైరెక్టర్లు బాజారమేష్, ఎల్లాగౌడ్,కాకి రాజయ్య రాజిరెడ్డి రాజు,గ్రామ సర్పంచ్ బొమ్మెన మల్లేశం,ఉప సర్పంచ్ ఆకుల మహేందర్ అబ్బా రెడ్డి,లింగమూర్తి,గందే రాములు,బిక్షపతి,మధు, వీరమల్లు బాలకృష్ణ నాయిని వెంకటేశం,శ్రీనివాస్, శ్యామ్ బోయినిచంద్రం పెంటయ్య,పందిరి భూమయ్య గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## మితిమీరిన వేగం ప్రమాదాలకు కారణం..

**ఎమ్మెల్యే గడ్డం వినోద్,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి,జనవరి13(సూర్యరేఖ)**రహదారులపై మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ తెలిపారు.రహదారి భద్రతా నిబంధనలు పాటించడంవల్లే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు.రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తాండూర్ మండల కేంద్రంలో తాండూర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్బెల్ట్ వినియోగించాలని సూచించారు.మద్యం సేవించి లేదా మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ సస్పెండ్ లేదా రద్దు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి డి.సి.పి. ఎ.భాస్కర్,బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ హాజరయ్యారు.ఇదే కార్యక్రమంలో రోడ్డు ప్రమాద బాధితురాలి కూతురు స్వాతికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రూ.10,000,ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మరో రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో పోలీసు అధికారులు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి..

**కరెంట్ వైర్లు, విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్త..**

**మెదక్ జిల్లా ప్రజలందరికీ భోగి,సంక్రాంతి,కనుమ పండుగ శుభాకాంక్షలు..**

**మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు**



**మెదక్,జనవరి13(సూర్యరేఖ)** మెదక్ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రజలంతా అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు సూచించారు.భోగి,సంక్రాంతి,కనుమ పండుగలను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...సంక్రాంతి పండుగ అంటే గాలిపటాల సంబరమని అయితే ఆనందంతో పాటు భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో కరెంట్ వైర్లు,విద్యుత్ స్తంభాలు,చెట్ల కొమ్మలు,బిల్డింగ్లపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భవనాల పైకప్పులపై గాలిపటాలు ఎగురవేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని చిన్నపిల్లలను పెద్దల పర్యవేక్షణలోనే గాలిపటాలు ఎగురవేయాలని తెలిపారు.అలాగే ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా (నైలాన్ దారం) విక్రయం, వినియోగం ప్రాణాంతకంగా మారుతుందని పేర్కొన్నారు.చైనా మాంజా వల్ల మనుషులకు,పక్షులకు తీవ్ర గాయాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో జిల్లాలో చైనా మాంజా విక్రయాలు లేదా వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చెట్ల కొమ్మలు లేదా కరెంట్ స్తంభాలకు చిక్కుకున్న గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించడం ప్రమాదకరమని,అలాంటి సందర్భాల్లో విద్యుత్ శాఖ లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస్ రావు...జిల్లా ప్రజలందరికీ భోగి, సంక్రాంతి,కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ,పండుగను సురక్షితంగా ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

# చైనా మాంజా వాడొద్దు పిల్లలు భద్రతే ముద్దు సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి





**జల్లిమోహన చిలుకానగర్ చౌరస్తాలో ఉచితంగా పతంగులు,చెరుకులు,దారాల పంపిణీ చేసిన బీఆర్ఎస్ నేత జల్లి మోహన్**

**ఉప్పల్,జనవరి13(సూర్యరేఖ)** సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చిలుకానగర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జల్లిమోహన్ ఆధ్వర్యంలో చిలుకనగర్ చౌరస్తాలో పిల్లలు పెద్దలకు పతంగులు,చెరుకులు దారాలు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు జల్లిమోహన్ మాట్లాడుతూ. పిల్లలు సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవడంతో పాటు సురక్షితంగా పతంగులు ఎగరేసుకోవడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా చైనా మాంజలు (నైలాన్ దారాలు) వాడటం వల్ల చిన్న పిల్లలు,ద్విచక్ర వాహనదారులు పక్షులకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని వివరించారు.గతంలో చైనా మాంజ కారణంగా అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు.పిల్లలు పతంగులు ఎగరేసే సమయంలో కరెంటు వైర్లు,బిల్లింగ్‌లు,రోడ్లకు దూరంగా ఉండాలని, పెద్దల పర్యవేక్షణలోనే పతంగులు ఎగరేసుకోవాలని సూచించారు.చైనా మాంజలు వాడటం చట్టపరంగా నేరమని,వాటిని ఉపయోగిస్తే ఇతరుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని పిల్లలకు స్పష్టంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాటి జగదీష్ ముదిరాజ్,పల్లె నర్సింగ్ రావు,పిట్టల నరేష్ ముదిరాజ్,ముక్కాల రామకృష్ణ ముదిరాజ్,ఈరెల్లి రవీందర్ రెడ్డి, కొంపల్లి రవీందర్ ముదిరాజ్, చేర్యాల శ్రీనివాస్, మాస శేఖర్, కొంపల్లి రాజ్‌కుమార్, రవీందర్ గౌడ్,శనిగరం తిరుమలేష్ కోలాని సంతోష్ రెడ్డి,ఫోటోల రాజు సదానంద చారి,రమేష్,ప్రసాద్ చారి ఆంజనేయులు చారి,మహిళ నాయకురాలు అనసూయ రెడ్డి,పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా చైనా మాంజ వద్దు పిల్లల భద్రత ముఖ్యం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

# ఎన్నికల హామీలను అమలు చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్

**లబ్ధిదారులకు గ్రీటింగ్స్ అందచేసిన ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్,జనవరి13 (సూర్యరేఖ)** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి పథకాల రూపంలో అమలు చేస్తున్నారని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గంలో గృహలక్ష్మి పథకం కింద లక్ష కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయన్నారు.ఉప్పల్ డివిజన్ లోని ఇందిరానగర్,మరియు కురుమనగర్ లో మంగళవారం రజితపరమేశ్వర్ రెడ్డి డిప్యూటీ సీఎం,విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నుంచి వచ్చిన గ్రీటింగ్స్ ను గృహజ్యోతి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అర్హులై ఉండి నెలకు 200యూనిట్లలోపు విద్యుత్ ను వినియోగించిన పేద,మధ్య తరగతి ప్రజలకు జీరో బిల్లు కింద ఉచితంగానే విద్యుత్ సరఫరా చేస్తున్నట్లుగా ఈ సందర్భంగా రజితపరమేశ్వర్ రెడ్డి తెలిపారు.





ఇదే తరహాలో ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కూడా రేవంత్ రెడ్డి సర్కార్ కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ.నిఖిల్ రెడ్డి,ఉప్పల్ ఏఈ. సత్యనారాయణరెడ్డి,పీర్జాదిగూడ లైన్మెన్ కిషన్ నాయక్,మురళి,డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్,ఈగ ఆంజనేయులు లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి,తోకటరాజు,సిడి వెంకటేష్ ప్రేమ్, అలుగుల,అనిల్,దుర్గం నవీన్ యాదవ్ గంజాయి నర్సింగరావు ఏసూరు మహేందర్ గోవింద్ కుమార్, రంగుల శేఖర్,బజార్ నవీన్ గౌడ్,డప్పురాజు,తోకాట రాహుల్,డప్పు రాహుల్ మండల నాగరాజు, మస్కవుతేజ్,డప్పు నందు గుండె వెంకటేష్,నాగోల్ నవీన్,పి.రామ్ చందర్ ముద్దం సుధాకర్ రెడ్డి రమేష్ యాదవ్,టీ.విజయ సింగ్ పి.మహేందర్ మహేష్ గౌడ్,జి.కొమురయ్య వినోద్ ఎస్.రామస్వామి, సత్యనారాయణ చారి మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయానికి ప్రతీక సంక్రాంతి

## ఘనంగా ముగ్గుల పోటీ నిర్వహణ..

## విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన ఏఎంసీ చైర్మన్

**ఖమ్మం,జనవరి13 (సూర్యరేఖ)** సంక్రాంతి సంబరాల్లో భాగంగా పేరువంచ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మంగళవారం కల్లూరు మండల పరిధిలో పేరువంచ సర్పంచ్ కీసర నిర్మలా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు కోలాహలంగా సాగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి పాల్గొని బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్,సర్పంచ్ మాట్లాడుతూ... తెలుగువారి సాంప్రదాయానికి ప్రతీక సంక్రాంతి పండుగ అని,భోగిమంటలతో,పిండి వంటలతో పండుగ మంచిగా జరుపుకోవాలని సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల రంగవల్లులతో ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఏఎంసీ చైర్మన్ బహుమతులు అందజేసి అభినందించారు.పోటీల్లో 25మంది పాల్గొనగా మొదటి బహుమతి ఎం.శిరీష రూ.5116,రెండవ బహుమతి ఎం.కల్పన రూ.3116,మూడో బహుమతి సిహెచ్. సౌమ్య రూ.2116లు అందుకున్నారు. ముగ్గుల పోటీల్లో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం భోగిమంట ఏర్పాటుచేసి మహిళలు ఆటపాటలతో అలరించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎం.డి మౌలాలి పంచాయతీ సెక్రటరీ రాజు,ఉపసర్పంచ్ పరిమి కృష్ణవేణి భరత్,వార్డు సభ్యులు కొండపల్లి మురళీకృష్ణ,కోట బన్నీ,బడుగు వెంకటేశ్వర్లు, జోగనబోయిన పుష్పలత గోపాల రావు,మంచాల శిరోమణీ మాధవరావు, వెంకటారవమ్మ,కిరణ్ నాయుడు తిరుపతిరావు నాయకులు కొప్పుల లక్ష్మీనారాయణ,గ్రామ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటి ఇంటికి గృహ జ్యోతి పథకం మంజూరు పత్రాలను పంపిణీ చేసిన ఆకారపు అరుణ్ పటేల్



**ఉప్పల్,జనవరి13 (సూర్యరేఖ)** వెంకట్ రెడ్డినగర్ డివిజన్ లో ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో గృహ జ్యోతి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయని అన్నారు.బాలకృష్ణనగర్,వెంకట్ రెడ్డినగర్, వాసవి నగర్,రామ్ రెడ్డినగర్,సత్యనగర్ కాలనీ తదితర కాలనీలలో గృహ జ్యోతి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గృహ జ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చు అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నెలకు 200యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు.విద్యుత్ బిల్లుల కోసం మీరు ఆదా చేసే డబ్బును మీ పిల్లల చదువులకు,కుటుంబ అవసరాలకు వాడుకోవచ్చని సూచించారు.ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో,వెంకట్ రెడ్డినగర్ డివిజన్‌లోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా మేము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక ప్రజాహిత కార్యక్రమాలతో రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ప్రమాణ స్వీకారం...



**కామారెడ్డి,జనవరి13(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్స్ లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఐవిఎఫ్ కామారెడ్డి జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ... ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం ఐవిఎఫ్ నిరంతరం పాటుపడుతుందని వైశ్యుల కోసమే కాకుండా,సమాజ హితం కోసం ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎర్రం చంద్రశేఖర్,దొంతి సుధాకర్,కస్వ వెంకటేష్ లను కామారెడ్డి జిల్లా ఐ.వి.ఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారులుగా ఎన్నుకోవడం జరిగిందని అన్నారు.ఐవిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చిలువేరి మారుతికి అవకాశం కల్పించడం జరిగిందని తెలియజేశారు,అధిక సంఖ్యలో సంఖ్యలో ఆర్యవైశ్యులు ఐవిఎఫ్ లో బాధ్యతలు చేపట్టడం ఎంతో అభినందనీయమని అన్నారు.దేశవ్యాప్తంగా ఐవిఎఫ్ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని ప్రిలిమ్స్ పాస్ అయిన వైశ్య అభ్యర్థులకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం, రక్తదానం,అన్నదానం,పేదలకు ఆర్థిక సహకారం,ఆడపిల్లల పెళ్ళిళ్లకు పుస్తే మెట్టెల పంపిణీ,పేద విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేయడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కామారెడ్డి జిల్లాలో రానున్న రోజుల్లో ఐవిఎఫ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని అన్నారు.కామారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారులుగా బుక్క రజని,చిలువేరి శ్రీదేవి,గజవాడ అన్నపూర్ణ,యువజన విభాగం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారులుగా ఎర్రం ఈశ్వర్,కౌడ ప్రవీణ్,దొంతి నిఖిల్ తదితరులు ఎన్నికయ్యారు.

## అంగన్వాడీ కేంద్రంలో ఏలాంటి అవకతవకలు లేవు..

**మద్దికల్ సర్పంచ్ పోతం సమ్మన్న**



**చెన్నూర్, జనవరి13 (సూర్యరేఖ)** భీమారం మండలం మద్దికల్ గ్రామంలోని రెండవ అంగన్వాడి సెంటర్ ను సర్పంచ్ పోతం సమ్మన్న తనిఖీ చేశారు.ఈ తనిఖీలలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్,సెక్టార్ సూపర్వైజర్, మరియు గ్రామస్తులు లబ్ధిదారులు సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు ఈ తనిఖీలు పాల్గొని సోమవారం ప్రముఖ దినపత్రికలో వచ్చిన అంగన్వాడీ కోడిగుడ్లకు సంబంధించిన విషయంపైన ఉన్నత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారుల్ని వివరాలు అడిగి తెలుసుకుని ఎలాంటి తప్పు ఎలాంటి లోటుపాట్లు లేవని రికార్డులో కూడా ఎక్కడ పొరపాటు లేదని సర్పంచ్ నిర్ధారించడం జరిగింది.ఈ తనిఖీలో గ్రామ ఉపసర్పంచ్,గ్రామ వార్డ్ మెంబర్లు,లబ్ధిదారుల పిల్లల ఆరోగ్య లక్ష్మికమిటీ సభ్యులు,ఐసిడిఎస్ సూపర్వైజర్,తదితరులు పాల్గొన్నారు.

# నరకానికి ఆనవాళ్లు చల్మెడ రోడ్డు

## కంకర పోసి సంవత్సరం గడుస్తున్న రోడ్డుకు అతిలేదు!గతి లేదు..

## డాంబర్ రోడ్డు వేయాలంటూ గ్రామస్తుల వేడుకోలు..







**నిజాంపేట,జనవరి13(సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా కంకరతేలి గుంతలు గుంతలుగా మారడంతో వాహనదారులకు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ రోడ్డు మరమ్మతులకై గతంలోనే నిధులు మంజూరయ్యాయని సదర్ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి కంకర పోసి చివరికి డాంబర్ వేసే సమయానికి రోడ్డు పనులు వదిలిపెట్టి వెళ్లడం జరిగింది.చల్మెడ గ్రామంనుండి నగరం, నందగోకుల్, నస్కల్ రాంపూర్,గ్రామాల మీదుగా అంతర్ జిల్లా అయినటువంటి ఇస్సన్ నగర్,బీబీపేట గ్రామాల మీదుగా జిల్లా కామారెడ్డి వరకు సులువుగా వెళ్లే మార్గం ఇది.గతంలో రోడ్డు బాగున్నప్పుడు కామారెడ్డి డిపో బస్సు నిత్యం ఈ గ్రామాల నుండి రామాయంపేటకు వెళ్ళేది.ఈ బస్సు మార్గంలో ఎంతోమంది కాలేజీ పిల్లలు స్కూల్ పిల్లలు వెళ్లేవారు.గత రెండు సంవత్సరాల నుండి రోడ్డు బాగు చేయకపోవడంతో ప్రయాణికులు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న అధికారులు నాయకులు పట్టించుకునే పాపనా పోలేదు.చల్మెడ గ్రామంలో సయంబుగా వెలిసిన శ్రీతిరుమలనాథ స్వామి ఆలయం ప్రతి సంవత్సరం జనవరి మాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతూ ఉంటాయి.ఈనెల 24 నుండి 27వరకు బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.ఈ బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకోవడానికి రావడం జరుగుతుంది.ఇటీవల నూతనంగా గెలుపొందిన సర్పంచుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సదర్ కాంట్రాక్టర్ తో మాట్లాడి రోడ్డు పనులు పూర్తి చేయాలని చెప్పినప్పటికీ కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించడం లేదు..గతంలో చేసిన బిల్లులు రావడంలేదని కాంట్రాక్టర్ ఆ బిల్లులు వస్తేనే పనులు ప్రారంభిస్తావని కరగండిగా తేల్చి చెప్పడం జరిగింది. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ వైఫల్యానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో ప్రయాణికులకు ప్రజలే బలవుతున్నారు. ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నామన్నారు.

**ఎమ్మెల్యే స్పందించి రోడ్డు పనులను ప్రారంభించాలి..**

**కాకి శ్రీను చల్మెడ గ్రామ వాసి..**

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి.గత రెండు సంవత్సరాలనుండి కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందులకు గురవుతున్నాము. నిత్యం గ్రామం నుండి రామయంపేటకు వెళ్లాలంటే ఆటోలు నడవక బస్సులు రాక గ్రామ ప్రజలు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. త్వరితగతిన రోడ్డు పనులు ప్రారంభించేలా చూడాలి.

**కంకర పోసి సంవత్సరం గడుస్తున్న డాంబర్ రోడ్డుకు మోక్షం లేదు..**

**దొంతర బోయిన మధు చల్మెడ గ్రామవాసి..**

చల్మెడ కమాన్ నుండి గ్రామం వరకు రోడ్డు కాంట్రాక్టర్ కంకర పోసి సంవత్సరం గడుస్తున్న డాంబర్ రోడ్డు కు మోక్షం కలగడం లేదు.కంకర తేలిన రోడ్డుపై వాహనదారులు ప్రయాణికులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మేము తెలంగాణ రాష్ట్రంలో ఉన్నామా లేదా? పక్క రాష్ట్రంలో ఉన్నామే అనే సందిగ్ధం నెలకొంది. ఇకనైనా అధికారులు నాయకులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించండి అయ్యా మహాప్రభు....

# సాటి కార్మికుడి ఆవేదన తోటి కార్మికుడికే తెలుస్తుంది

**సింగరేణిలో మెడికల్ అన్ఫిట్ ఐన కార్మికులను సన్మానించిన పదవి విరమణ పొందిన కార్మికుడు**



**మందమర్రి, జనవరి 13, (సూర్యరేఖ)**సింగరేణిలో పదవి విరమణ పొందిన కార్మికులను సన్మానిస్తున్న యాజమాన్యం, అదే సంస్థలో విధులు నిర్వహించి అన్ఫిట్ ఐన కార్మికులను సన్మానించక పోవడంతో ఆవేదనకు గురైన సాటి కార్మికుడు వడ్డెపల్లి ఓదయ్య వారిని ఘనంగా సత్కరించి సాటి కార్మికుడి ఆవేదన తోటి కార్మికుడికే తెలుస్తుందనే నిజాన్ని నిజం చేశారు. సుదీర్ఘ కాలంగా సింగరేణి సంస్థలో విధులు నిర్వహించి అనారోగ్య కారణాలతో మెడికల్ అన్ఫిట్ ఐన కార్మికులను, సాటి పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికుడు వడ్డెపల్లి ఓదయ్య వారి స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో వారిని ఘనంగా సన్మానించి మిఠాయి పొట్లం అందజే శారు. ఈ సందర్భంగా వడ్డెపల్లి ఓదయ్య మాట్లా డుతూ సింగరేణిలో సుదీర్ఘ కాలంపాటు క్రమ శిక్షణ, అంకిత భావంతో విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి, అనేక సవాళ్లను, ఆటు పోట్లను ఎదుర్కొని పదవి విరమణ పొందుతున్న కార్మికులను సన్మానిస్తున్న సింగరేణి యాజమాన్యం అదే విధంగా భూగర్భ గనుల్లో విధులు నిర్వహించి మెడికల్ అన్ఫిట్ ఐన కార్మికులను సన్మానించక పోవడం నన్ను కలచి వేసిందని, సాటి కార్మికుడిగా వారి సేవలను గుర్తించి ఆత్మీయంగా గౌరవించాలనే సంకల్పించి అన్ఫిట్ ఐన కొందరి జాడ తెలుసుకుని వారిని ఈ విధంగా సన్మానించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కార్మికులు వాసాల శంకర్, నామని ముత్తయ్య, మాడగోని శంకర్ గౌడ్, దాసరి రాములు, నెల్లి రాయలింగు, భూమయ్య, సాంబయ్య, పీరయ్య, రాయమల్లు, బిఆర్ఎస్ నాయకులు మద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గౌడ కులస్థుల ఆద్వర్యంలో వర్తక సంఘం అధ్యక్షుడికి ఘనంగా సన్మానం



**మందమర్రి,జనవరి13(సూర్యరేఖ)** పట్టణంలోని పాత బస్టాండ్ వర్తక వ్యాపార సంఘం అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సొంతం చేసుకుని హ్యాట్రిక్ సాధించిన వడ్లకొండ కనుకయ్య గౌడ్ ను మందమర్రి పట్టణ గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో వ్యాపార సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కనకయ్యను ఘనంగా సన్మానించి మిఠాయి పంచి పెట్టారు.ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ...వ్యాపార సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మృదు స్వభావి కనకయ్యగౌడ్ పాత బస్టాండ్ వ్యాపారస్తులకు అందుబాటులో ఉండి నిరంతరం వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సంఘం అభివృద్ధికి, వ్యాపారస్తుల సమస్యల పరిష్కారానికి పాటు పడాలన్నారు.చిరు వ్యాపారుల వ్యాపార అభివృద్ధికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించి వారిని ప్రోత్సహించాలని కోరారు.అలాగే కుల సంఘం అభివృద్ధికి తగిన సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మండ భాస్కర్ గౌడ్,నోముల ఉపేందర్ గౌడ్,సట్ల రవీందర్ గౌడ్,మద్ది వేణుగోపాల్ గౌడ్,బండి శంకర్ గౌడ్, నోముల రాజేందర్ గౌడ్, వడ్లకొండ రంజిత్ గౌడ్, గౌడ కులస్తులు,వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నూతన క్యాలెండర్ ఆవిష్కరణ..

**ఎంపీ.మందాడి అనిల్ కుమార్ యాదవ్**



**చెన్నూర్,జనవరి13(సూర్యరేఖ)** హైదరాబాద్ లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం 2026 రాష్ట్ర క్యాలెండర్ ను రాజ్యసభ సభ్యులు మందాడి అనిల్ కుమార్ యాదవ్ చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా ఎంపీ మందాడి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... యాదవ అభివృద్ధికై తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చిల్లారపు సంతోష్ కుమార్ యాదవ్, జిల్లా నాయకులు కొండన్న యాదవ్, శ్రావణ్ యాదవ్,ఎంకే రాజేష్,రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## కార్మెల్ పాఠశాలలో ముగిసిన వార్షిక క్రీడోత్సవాలు..



**మందమర్రి,జనవరి13(సూర్యరేఖ)** పట్టణంలోని కార్మెల్ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా అట్టహాసంగా నిర్వహిస్తున్న వార్షిక క్రీడలు ముగిశాయి.మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో కార్మెల్ అకాడమీ డైరెక్టర్ ఫాదర్ జెవిఆర్ రెక్స్ యస్ జే పాల్గొని క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్మెల్ అకాడమీలో విద్యతో పాటు విద్యార్థులలోనీ నైపుణ్యం,మేధస్సు పట్టుదల, యూనిటీ,క్రమశిక్షణ,వెలికి తీసేందుకు క్రీడల ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విద్యతోపాటు తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు, పండుగల విలువలను వివరించేలా అధ్యాపకులు విద్యార్థులతో కలిసి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో భోగిమంటలు వేసి ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు హరిదాసుల వేషధారణలో రాగా పాఠశాల ఫాదర్ నవధాన్యాలను ధానం చేశారు. అనంతరం ఒకరికొకరూ భోగి,కనుమ,మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జూజు అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రిపబ్లిక్ డే,సమ్మక్కజాతరలో సౌకర్యాలతో కూడిన ఏర్పాట్లు..

**ఏరియా జిఎం రాధాకృష్ణా**



**మందమర్రి,జనవరి13,(సూర్యరేఖ)** సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకలను సమ్మక్కసారలమ్మ జాతరలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఘనంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ కోరారు.మంగళవారం జిఎం కార్యాలయంలో జిఎం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రిపబ్లిక్ డే,సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను ఏరియా అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో జనవరి 26 న నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను కోరారు. అదే విదంగా ఈ నెల 28 నుండి 31వరకు ఆర్కే 1ఎ సమీపంలో నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా చూడాలన్నారు.ఈ సందర్భంగా సంబంధిత ఉన్నతాధికారులకు జాతరకు సంబంధించి సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జిఎల్ ప్రసాద్,కేకే ఓసి ప్రాజెక్టు అధికారి మల్లయ్య,కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు,ఎస్కె గ్రూప్ ఏజెంట్ ఖాదీర్,ఏరియా ఇంజనీర్ డివైజిఎం ఈఅండ్ఎం బాలాజీ భగవత్ జ, డీజీఎం పర్సనల్ అశోక్, సీనియర్ పిఓ సత్యనారాయణ,డీజీఎం ఐఈడి కిరణ్ కుమార్, సివిల్ ఎస్ఈ శ్రీధర్,డీజీఎం ఈ అండ్ఎం ఏరియా వర్క్ షాప్ దూప్ సింగ్, డివైపిఎం ఆసిఫ్,సీనియర్ పర్సనల్ అధికారి సందీప్,ఏరియా సర్వే అధికారి దేశాయ్,డివై మేనేజర్ ఐటి రవి,పలు డిపార్ట్మెంట్ల అధికారులు అన్ని గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి కార్మికులకు గౌరవ సన్మాన కార్యక్రమం నిర్వహించిన బిజెపి నాయకులు గోనె శ్రీకాంత్ ముదిరాజ్

**ఉప్పల్,జనవరి13(సూర్యరేఖ)** సూర్యుడు ఉదయించకముందే ప్రతీ వీధిని శుభ్రపరుస్తూ. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పరిశుభ్రతని పెంపొందిస్తూ..తమ పిల్లలను కుటుంబాన్ని వదిలేసి ప్రతిరోజు తెల్లవారుజామున మన కొరకై ప్రకృతిని కాపడుతూ..మన ఆరోగ్య రక్షలు-మన ఆనంద కారకులు.మన హైదరాబాద్ ను సుందరంగా ఉంచుతున్న దేవతశ్రామికులు. జిహెచ్ఎంసి కార్మికులు.అలాంటి జిహెచ్ఎంసి కార్మికుల శ్రమను అందరు గుర్తించాలని,వారిని గౌరవించాలని చెప్తూ వారికోసం సభను ఏర్పాటు చేసి జిహెచ్ఎంసి కార్మికులందరీనీ గౌరవంగా ఘనంగా సత్కరించి,సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అందరికి తోబుట్టువుల బట్టలు పెట్టి స్వీట్స్ అందించి అల్పాహారం ఏర్పాటు చేసి బిజెపి సీనియర్ నాయకులు గోనె శ్రీకాంత్ ముదిరాజ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ బిజెపి రాష్ట్ర నాయకులు తాడూరి శ్రీనివాస్,సంఘ సభ్యులు




రాంబాబు చౌదరిలు ముఖ్యఅతిథిలుగా పాల్గొని జిహెచ్ఎంసి కార్మికులు చేస్తున్నా సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమం తీసుకున్న గోనె శ్రీకాంత్ ని అభినందించారు.జిహెచ్ఎంసి కార్మికులు అనందం వ్యక్తంచేశారు.వారిని గుర్తించి గౌరవించి ఇంత గొప్ప కార్యం చేసిన గోనె శ్రీకాంత్ మంచి మనస్సును అభినందించారు.తమ ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి



సీనియర్ నాయకులు గోనె అంజయ్య ముదిరాజ్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు డప్పు దత్తసాయి,భరత్ రెడ్డి,కొట్టం ఉపేందర్ రెడ్డి, రాచకొండ శివకుమార్ కృష్ణ ముదిరాజ్,పారుపాటి రాంరెడ్డి, కొంగరి రామచందర్,పోలోజు శ్రీనివాస్ చారి, మడిపడిగే శ్రీనివాస్,మహిళా నాయకురాలు దొంతి ప్రభావతి, మాధవేని మమత,కవిత మరియు మహిళాలు యువకులు బస్తీ వాసులు పెద్దలు పాల్గొన్నారు.

# డైరెక్టర్ శ్రీ వాణి చౌదరి అందరికీ ఆదర్శం

**ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ జోయల్ దేవీస్**
**డైరెక్టర్ శ్రీవాణిచౌదరి నేటితరానికి ఆదర్శం**
**పాట అద్భుతం..**
**ట్రాఫిక్ పై అవగాహన కల్పించడం అందరి బాధ్యత..**

**హైదరాబాద్,జనవరి13(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం డైరెక్టర్ శ్రీవాణి చౌదరి సామాజిక బాధ్యత కలిగిన మహిళగా సమాజానికి నిజమైన ఆదర్శమని,ఆమె కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి స్థాయిలో సేవ చేస్తూ, నేటితరానికి మార్గదర్శకురాలిగా నిలిచిందని ట్రాఫిక్ రూల్స్ పట్ల అవగాహన కలిగించే విధంగా అద్భుతమైన పాట ఆ పాటను ముఖ్యమంత్రి చేతుల మీదిగా ఆవిష్కరించడం ఎంతో గొప్ప విషయమని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ జోయల్ దేవీస్ ప్రశంసించారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన అర్రైవ్,అలైవ్ కార్యక్రమంలో భాగంగా హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం డైరెక్టర్ శ్రీవాణి చౌదరికి హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ జోయల్ దేవీస్ చేతుల మీదుగా మెమొంటోను అందజేశారు.ఈ సందర్భంగా జోయల్ దేవీస్ మాట్లాడుతూ...సమాజాభివృద్ధిలో డైరెక్టర్ శ్రీవాణిచౌదరి లాంటి మహిళలపాత్ర కీలకమన్నారు.ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కల్పించడం అత్యంత అవసరమని అది మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో రోడ్లపై పెరిగిన ట్రాఫిక్




కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని,డైరెక్టర్ శ్రీవాణిచౌదరి రాసిన పాట ద్వారా అందరిలో అవగాహన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ పాటలో చెప్పిన విధంగా నియమాలను పాటించడం వల్ల మనం, మన కుటుంబం సమాజం సురక్షితంగా ఉంటామని హితవు పలికారు.ఈ సందర్భంగా శ్రీవాణిచౌదరి మాట్లాడుతూ...ట్రాఫిక్ రూల్స్ ని అందరూ తప్పనిసరిగా పాటించాలని,హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని,కుటుంబ సభ్యులు మనపై పెట్టుకున్న ఆశలను అడియాశలు చేయవద్దని,రాంగ్ రూట్లో ప్రయాణం చేయవద్దని, పోలీసులకు సహకరించాలని,మన ప్రాణ రక్షణకై పోలీసులు విధి నిర్వహణలో కొన్ని కఠిన నియమ నిబంధనలు తీసుకుంటారే తప్ప మనపై ద్వేషంతో కాదని,పోలీసులకు అందరం సహకరించాలని, ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల ప్రజల్లో చైతన్యం కలుగుతుందని,ట్రాఫిక్ నియమ నిబంధనలు అందరూ తప్పనిసరిగా పాటించాలని మార్పురావాలని శ్రీవాణి కోరుకున్నారు.

## విఎస్టి కాలనీలో ముగ్గుల పోటీలు..

**బహుమతులు ప్రధానం చేసిన బిఆర్ఎస్ రాష్ట్ర నేత సాయిజన్ శేఖర్**



**ఉప్పల్,జనవరి13(సూర్యరేఖ)** నాచారం డివిజన్ విఎస్.టి.కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, మాజీ కౌన్సిలర్ అనితా పద్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వీఎస్టి కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ...సాంప్రదాయాలు ఉట్టి పడేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతీ మహిళకు,కాలనీ సంక్షేమ సంఘం సభ్యులకు,కాలనీ వాసులకు,పోటీ నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా విఎస్టి కాలనీ ప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు.

# నేడు అయ్యప్ప స్వామికి విశేష నెయ్యాభిషేకం



**మణికంఠహిల్స్ అయ్యప్పస్వామి దేవాలయంలో కార్యక్రమానికి హాజరుకావాలని అయ్యప్ప సేవా సమితి సభ్యుల పిలుపు..**

**రాజేంద్రనగర్,జనవరి13(సూర్యరేఖ)** అయ్యప్పస్వామి కరుణ కటాక్షాలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ కాటేదాన్ టీఎన్జీవోఎస్ కాలనీ మణికంఠ హిల్స్ అయ్యప్ప స్వామి దేవాలయం శ్రీఅయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీఅయ్యప్ప స్వామి విశేష నెయ్యాభిషేకం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ మేరకు మంగళవారం సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ...శ్రీఅయ్యప్ప స్వామి విశేష నెయ్యాభిషేకాన్ని బుధవారం సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయంలో ఘనంగా నిర్వహించను న్నట్లు వివరించారు.బుధవారం మకరజ్యోతిని పురస్కరించుకొని శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయం లో ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం



12 గంటల వరకు కార్యక్రమం ఉండనుందని భక్తులు తగిన నెయ్యి తెచ్చుకోవాలని సూచించారు. అంతేకాకుండా సాయంత్రం 6 గంటలకు జ్యోతి దర్శనం,రాత్రి 8గంటలకు పుష్పాభిషేకం ,భస్మాభిషేకం నిర్వహించడం జరుగుతుందని వివరించారు.ఈ మేరకు అయ్యప్ప స్వాములు భక్తులు అందరూ స్వామి వారి సేవలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అయ్యప్ప స్వామి వారి కృపకు పాత్రులు కావాలని సేవా సమితి సభ్యులు సూచించారు.మరిన్ని వివరాలకు 80081144 09,9391018367, 9391001243, 9399 946007లలో సంప్రదించాలని సూచించారు.

## ఐక్యత,సంక్షేమం,పోరాటానికి ప్రతీకగా 2026 క్యాలెండర్ ఆవిష్కరణ..



**నాంపల్లి,హైదరాబాద్,జనవరి13(సూర్యరేఖ)** తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ మైనారిటీస్ అవుట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం సైదాబాద్‌లో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ బి.షఫీఉల్లా హాజరై క్యాలెండర్‌ను అధికారికంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా షఫీఉల్లా మాట్లాడుతూ...మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో అవుట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.విద్యాసంస్థలు సజావుగా నడవడంలో నాన్ టీచింగ్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని వారి సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో మరింత సహకారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హమ్మద్ రాజమ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్లు తహసీన్ సుల్తానా,పర్వీన్ బేగం,కార్యదర్శి రేష్మా ఫర్విన్,కోశాధికారి ఘౌస్,ఉపాధ్యక్షులు ఇస్మత్ ఆరా,రఫీయొద్దీన్,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.డి.హకీమ్ఒద్దీన్‌తో పాటు ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,జిల్లా ఇన్‌చార్జీలు తదితరులు పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ. అవుట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం,వేతనాల పెంపు,ఉద్యోగ భద్రత,సేవా నిబంధనల మెరుగుదల కోసం నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం సంఘటితంగా ముందుకు సాగుతామని తెలిపారు.

## గుంతల మయంగా రోడ్డు అవస్థలో ప్రజలు పట్టించుకుని ప్రజాప్రతినిధులు..



**కామారెడ్డి,జనవరి13 (సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలో వివిధ కాలనీలో గుంతల మయంగా రోడ్లు మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.కామారెడ్డి కొత్త బస్టాండ్ ముందు నుండి అశోక్ నగర్ వెళ్లే మార్గంలో రోడ్డు మొత్తం గుంతలమైన మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు సిరిసిల్ల రోడ్డు గుంతల మయంగా మారడంతో ఆరోడ్డు వెంబడి వెళ్లే గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లక్ష్మీదేవి గార్డెన్ నుండి ఎస్ పిఆర్ స్కూల్ కు వెళ్లే మార్గం పూర్తిగా గుంతలు గుంతలుగా మారడంతో స్కూలుకు వెళ్లే పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.అధికారులు మాత్రం అటువైపు చూడడం లేదు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలు కాపాడాలని కామారెడ్డి ప్రజలు కోరుచున్నారు

## బుద్వేల్ స్క్రాప్ గోడౌన్ లో అగ్ని ప్రమాదం..

**మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది..**
**ఘటన స్థలాన్ని పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి**



**రాజేంద్రనగర్,జనవరి13 శ్రీ(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ ప్లాస్టిక్ స్క్రాప్ గోడౌన్‌లో మంగళవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.కిస్మాత్ పూర్ బ్రిడ్జ్ కు అనుకుని ఉన్న గోడౌన్ పై నుంచి హైటెన్షన్ తీగలు వెళ్తున్నాయి.తీగల స్పార్క్స్ ప్లాస్టిక్ పై పడటంతో అగ్గి రాజేసుకుంది.అగ్నికీలలు ఎగిసిపడుతుండటంతో. పరిసరాల్లో దట్టమైన పొగ అలుముకుంది. మంటలు పొగ తీవ్రస్థాయిలో వ్యాపిస్తుండటంతో..స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో.. కార్మికులతో పాటు స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు.స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు.జనవాసాల మధ్యలో నుంచి గోడౌన్ ను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఘటన స్థలాన్ని రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి పరిశీలించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న గోడౌన్ పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు







గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేసిన డాక్టర్ శిల్పారెడ్డి,డాక్టర్ అమరేందర్,వై.శ్రీధర్,లు

**రాజేంద్రనగర్,జనవరి13(సూర్యరేఖ)** సంక్రాంతి ఉత్సవాలు మన సంస్కృతి,సంప్రదాయాలకు అద్ధం పడుతాయని రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి,రామయ్య క్లినిక్ అధినేత డాక్టర్ అమరేందర్,గోల్కొండ,గోషామహల్ జిల్లా ఇన్చార్జి వై. శ్రీధర్,లు అన్నారు.ముగ్గుల పోటీలు నిర్వహించడం ద్వారా ఎంతో మందిలో స్ఫూర్తిని నింపవచ్చని వివరించారు.సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకొని రాజేంద్రనగర్ డివిజన్ భారతీయ జనతా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ ముగ్గుల పోటీలు డివిజన్ అధ్యక్షురాలు గడిల పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.దాదాపు 100 మంది మహిళలు,చిన్నారులు,విద్యార్థినిలు ఉదయం 10 గంటలకు వచ్చి దేవాలయం ముందు వారి కలలు ప్రదర్శించారు.రంగురంగుల ముగ్గులు,గొబ్బెమ్మలు,చుక్కల ముగ్గులు,రథాల ముగ్గులు,పండుగకు సంబంధించినటువంటి సంక్రాంతి ప్రత్యేక ముగ్గులను వేసి సాంప్రదాయాన్ని,ధర్మాన్ని కాపాడే విధంగా ముగ్గులు వేశారు.ముగ్గుల పోటీపై ఆసక్తితో వచ్చిన ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులను అందించారు.ఇందులో ప్రత్యేకంగా జీహెచ్ఎంసీ సిబ్బంది ఉదయం నుంచి స్థానికంగా శుభ్రపరిచి తర్వాత ప్రత్యేకంగా మంచి సంప్రదాయం ముగ్గు వేసి వారు కూడా బహుమతి తీసుకోవడం జరిగింది.డాక్టర్ అమరేందర్ టాప్ టెన్ పదిమందిని నిర్ణయించారు.అందులో మొదటి బహుమతి అనిత,రెండు పల్లవి,మూడు అమూల్య నాలుగు సరిత,ఐదు సునీత,ఆరు సాయి సరిత ఏడు కె కవిత,ఎనిమిది ఇందిరా లావణ్య తొమ్మిదవ శాలిని,పదవ బహుమతులు కృష్ణవేణిలకు దక్కాయి వీరందరికీ డాక్టర్ శిల్పారెడ్డి చేతులపై బహుమతి అందజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షులు జి.బాబురావు,రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి వినితరెడ్డి,ఎస్సీ మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్,బీసీ మోర్చా కార్యదర్శి అనురాధ,డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షురాలు సరిత రెడ్డి,కార్యదర్శి కవిత,అంబికా,పెంటయ్య,వై హరగోపాల్,జ్యోతి,తృప్తి,సతీష్,దయాకర్,శ్రీకాంత్, బి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు

**సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందించాలి..**

**మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా ముత్యాల ముగ్గుల పోటీలు..**

**విజేతలకు బహుమతుల ప్రదానం..రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**





**రాజేంద్రనగర్,జనవరి13(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని మాజీ కౌన్సిలర్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరయ్యారు. ముగ్గుల పోటీలు సందర్భంగా మన సంప్రదాయాలను గౌరవిస్తూ,మహిళలు అత్యంత ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు.మన సంస్కృతిని కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించాల్సి అవసరం ఎంతైన ఉందన్నారు.నేటి కాలంలో మన దేశ సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించే ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఈ సందర్భంగా మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి. ముగ్గల పోటీలో పాల్గొన్న అందరికి కార్తీక్ రెడ్డి బహుమతులు అందచేసారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, డి.రమేష్ ముదిరాజ్,నోముల రాముయాదవ్ బండ రాజేష్ యాదవ్,కే.లక్ష్మీ,సరిత,భూదేవిరెడ్డి, సుగుణమ్మ,లక్ష్మిప్రసన్న,పుష్ప,లలిత,మైసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో మున్సిపల్ ఎన్నికలను నిర్వహించేది ఎప్పుడూ

**మంత్రి హామీ నిలబెట్టుకునేది ఎప్పుడూ..**

**బారాస పట్టణ అధ్యక్షులు జే.రవీందర్**



**మందమర్రి,జనవరి13(సూర్యరేఖ)** మందమర్రి పట్టణంలో మున్సిపాలిటీ ఎన్నికలను నిర్వహిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర గనులు కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఇచ్చిన హామీ నిలబెట్టుకునేది ఇంకా ఎప్పుడని బారాస పార్టీ పట్టణ అధ్యక్షులు జే. రవీందర్ ప్రశ్నించారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా ఏజెన్సీ వివాదం కారణంగా నిలిచిపోయిన మున్సిపల్ ఎన్నికలను కచ్చితంగా నిర్వహిస్తామని ఎన్నికల సమయంలో మంత్రి హామీ ఇచ్చిన అప్పటి వీడియోను చరవాణిలో ప్రదర్శించారు.పట్టణ ఏజెన్సీ ప్రాంతాన్ని మున్సిపాలిటీగా మారుస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో లబ్ధిపొందినప్పటికీ మున్సిపాలిటీ ఎన్నికలు జరిపించక పోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. పట్టణంలో అభివృద్ధి పనులు చేయడంలో మంత్రి పూర్తిగా విఫలం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పట్టణంలోని మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో గెలిచిన వెంటనే శంకుస్థాపన చేసిన సులబ్ కాంప్లెక్స్ ఇప్పటి వరకు కూడా పూర్తి చేయకపోవడం మంత్రి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు.బారాస ప్రభుత్వ హయంలో చెన్నూరు మాజీ బాల్కసుమన్ మున్సిపాలిటి అభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు తీసుక వచ్చి అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మేలు చేశాడని ఆయన గుర్తు చేశారు.సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్, కేసిఆర్ పార్క్,హిందూ స్మశాన వాటికలు, క్రిస్టియన్, ముస్లిం గ్రీవ్ యార్డులు,సెంట్రల్ లైటింగ్ అంబేద్కర్ స్కిల్ సెంటర్,దోభి ఘాట్ వంటి పనులు పూర్తి చేయక వాటికి కేటాయించిన నిధులతో రోడ్లు డ్రైనేజీలు నిర్మాణాలు చేపడుతూ మంత్రి గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు.పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ నుండి పాల చెట్టు ఏరియా వరకు రోడ్డు వెడల్పు,సెంట్రల్ లైటింగ్ కొరకు 2కోట్లతో సుమన్ అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ సెక్రెటరీ జనరల్ బండారు సూరిబాబు, మేడిపల్లి సంపత్,సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్, పార్టీ సీనియర్ నాయకులు,యూత్ విద్యార్థి సోషల్ మీడియా వార్డు అధ్యక్షులు మద్ది శంకర్, కొంగల తిరుపతిరెడ్డి,నలువాల సమ్మయ్య బోరిగం వెంకటేష్,మేడిపల్లి మల్లేష్,భూపెల్లి కనకయ్య పల్లె నర్సింగ్, వీరరెడ్డి,బట్టు రాజ్ కుమార్,తోట సురేందర్, ఎండి ముస్తఫా, బెల్లం అశోక్,దాసరి నవీన్,రవి నాయక్, మొగురం శ్రీను మటన్ రాకేష్,సటు పోషం, రవి వర్మ పవయ్య శేఖర్ యాదవ్,వేణుగోపాల్ రెడ్డి, సంగర్తి సంతోష్ కొండం శ్రీను,ముల్కల రమేష్, మోహన్,బెల్లం అరుణ్,మొగిలి అజయ్,సీపెల్లి సాగర్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెగా ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంలో భారీగా పాల్గొన్న ప్రజలు..



**నాంపల్లి,హైదరాబాద్,జనవరి13 శ్రీ(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ గుడిమల్కాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్,ప్రజా సేవయే పరమావధిగా ప్రజలకు సేవలు అందించిన ప్రియతమ నాయకులు స్వర్గీయ దేవర కరుణాకర్ వర్ధంతి పురస్కరించుకొని భాజపా గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ ప్రాంత స్వామివివేకానంద విగ్రహం సమీపంలో ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యరంగానికి ముఖ్యఅతిధిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంలో ప్రజలకు సాధారణ ఆరోగ్య పరీక్షలు,రక్తపోటు మరియు చక్కెర పరీక్షలు,కంటి పరీక్షలు మరియు సంప్రదింపులు,దంత పరీక్షలు,గుండె సంబంధిత సంప్రదింపులు (ఈసీజీ) పిల్లల వైద్య పరీక్షలు,స్త్రీల వైద్య సంప్రదింపులు మరియు ఉచిత మందుల పంపిణీ చేశారు.పరిసర ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంలో లభించిన ఉచిత సేవలు సద్వినియోగ చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు సంక్షేమ పథకాలు చేరువ చేస్తా..

**సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ అందజేతలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్,జనవరి13(సూర్యరేఖ)** :పేదలు సీఎం రిలీఫ్ ఫండ్ లను సద్వినియోగించుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ సూచించారు.అర్హులైన ప్రజలకు తన వంతుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. మంగళవారం ఎమ్మెల్యే ఆయన నివాసం వద్ద కాటేదాన్ శాంతినగర్ కు చెందిన లాల్ ముత్వద్ కుమారుడు సాకేత్ లాలుకు కోఠి ఈఎన్టీ హాస్పిటల్ వారు పరికరం అమర్చడానికి సీఎం రిలీఫ్ కింద మంజూరైన రూ. 7లక్షల రూపాయల విలువైన ఎల్ఓసి పత్రాలను ఎమ్మెల్యే స్వయంగా అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేద ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు వెనుకాడటం లేదన్నారు.పేద,బడుగు,బలహీన వర్గాలకు తప్పకుండా ప్రభుత్వం నుంచి అందేలా చూడటం జరుగుతుందని వివరించారు.తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ,కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న పేదల కోసం ప్రభుత్వం ఈ ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు.నియోజకవర్గ ప్రజల ఆరోగ్యంపై తమకు ప్రత్యేక శ్రద్ధ ఉందని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే సిఫార్సుతో ఈ భారీ మొత్తంలో ఎల్ఓసి మంజూరు కావడం పట్ల లబ్ధిదారులు,వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సమస్యలను కింది స్థాయి నాయకుల నుంచి తెలుసుకొని వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు.అంతేకాకుండా సంక్షేమ కార్యక్రమాలను సైతం పేదలకు చేరువ చేస్తానని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది, స్థానిక నాయకులు,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అక్కన్నపేటలో గృహ జ్యోతి పథకం అమలు..

**738 కుటుంబాలకు 'జీరో కరెంట్ బిల్లు' ప్రయోజనం..**




**రామాయంపేట,జనవరి13 (సూర్యరేఖ)** :రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి (జీరో కరెంట్ బిల్లు) పథకం అక్కన్నపేటలో విజయవంతంగా అమలైంది.ఈ పథకానికి సంబంధించిన గృహ జ్యోతి పాత్రలను కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అక్కన్నపేటలో గృహ జ్యోతి పథకం కింద మొత్తం 738 లబ్ధిదారులకు గృహజ్యోతి పత్రాలను అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వ సామాజిక సంక్షేమ దృక్పథానికి ఇది నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు.విద్యుత్ భారం తగ్గిస్తూ పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కల్పించడమే గృహ జ్యోతి పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమార్ సాగర్,రామ్కి,చింటు సురేందర్,శ్రీను,సాయి పాల్గొని లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు కృషి చేస్తున్నారని వారు అన్నారు.గృహ జ్యోతి పథకం ద్వారా జీరో కరెంట్ బిల్లు ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మాజీ ఎమ్మెల్యే హన్మంతుకు,ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వారు అభిప్రాయపడ్డారు.




# 'మన శంకరవరప్రసాద్ గారు' ఫస్ట్ డే కలెక్షన్స్ ప్రకటన

చిరంజీవి- అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా ఫస్ట్ డే కలెక్షన్స్ ప్రకటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైన ఈ మూవీ పాజిటీవ్ టాక్ తెచ్చుకుంది. ఇందులో చిరంజీవితో పాటు వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా, సచిన్ ఖేడ్కేర్ తదితరులు నటించారు. ఈ మూవీని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. భోళా శంకర్ వంటి డిజాస్టర్ తర్వాత చిరుకు భారీ హిట్ పడిందని ఫ్యాన్స్ ఫుల్ జోష్‌లో ఉన్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' ప్రీమియర్స్‌తో కలిపి ఫస్ట్ డే భారీ కలెక్షన్స్ రాబట్టింది. ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ. 84కోట్లు రాబట్టినట్లు చిత్ర నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ ప్రకటించింది. మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లోనే రెండో అతిపెద్ద ఓపెనింగ్ చిత్రంగా 'మన శంకరవరప్రసాద్ గారు' నిలబడింది. 'సైరా నరసింహా రెడ్డి' చిత్రానికి మొదటిరోజు రూ. 85 కోట్లు వచ్చిన విషయం తెలిసిందే. ఖైదీ నంబర్ 150'కి (రూ. 51 కోట్లు), వాల్తేరు వీరయ్య (రూ. 49.10 కోట్లు), గాడ్ ఫాదర్ (రూ. 32.70 కోట్లు), ఆచార్య ( రూ. 52 కోట్లు), భోళా శంకర్ (రూ. 28 కోట్లు) వచ్చాయి.



# 100 ఎకరాల పొలం కావాలి.. నటులు మాత్రం వద్దు

## మీనాక్షి చౌదరి కండీషన్స్ వైరల్

టాలీవుడ్‌లో "లక్కీ హీరోయిన్"గా పేరు తెచ్చుకున్న అందాల భామ మీనాక్షి చౌదరి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో కొనసాగుతోంది. గత ఏడాది సంక్రాంతికి విడుదలైన 'వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, ఇప్పుడు మరోసారి పండగ సీజన్‌ను టార్గెట్ చేస్తోంది. యంగ్ హీరో నవీన్ పోలిశెట్టితో కలిసి నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు' తో ఈసారి కూడా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు మంచి స్పందన తెచ్చుకోగా, ప్రమోషన్స్‌లో మీనాక్షి చౌదరి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ముఖ్యంగా ప్రీ రిలీజ్ ఈవెంట్స్, ఇంటర్వ్యూల్లో ఆమె మాట్లాడిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో తనకు కాబోయే భర్త గురించి మాట్లాడిన మీనాక్షి చౌదరి, కొన్ని ఆసక్తికరమైన 'కండిషన్స్' పెట్టి అందరినీ నవ్వులు పూయించింది. తన భర్త డాక్టర్, నటుడు లేదా మిస్టర్ ఇండియా మాత్రం అసలు కాకూడదని స్పష్టం చేసింది. తాను ఇప్పటికే సినిమా రంగంలో ఉన్నానని, ఇంట్లో మరోసారి అదే ప్రొఫెషన్ అవసరం లేదని చమత్కారంగా వ్యాఖ్యానించింది. అంతేకాదు, తన జీవిత భాగస్వామికి 100 ఎకరాల పొలం ఉండాలి అంటూ చెప్పిన మాటలు ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయం, పల్లెటూరి వాతావరణం అంటే తనకు చాలా ఇష్టమని తెలిపింది. ఇక ఇంటి పనుల విషయంలో కూడా మీనాక్షి తన స్టైల్‌లో కండిషన్స్ పెట్టింది. వంట చేయడం, బట్టలు ఉతకడం, ఐరన్ చేయడం వంటి పనులు రావాలని చెప్పి నవ్వులు పూయించింది. అబ్బాయికి గతంలో బ్రేకప్స్ ఉన్నా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే పొడవుగా ఉండాలని మాత్రం కచ్చితంగా చెప్పింది. రోజుకు రెండు మూడు సార్లు లవ్ ప్రపోజ్ చేస్తూ, గిఫ్ట్ ఇచ్చే వ్యక్తే తన "రాజు" అంటూ సరదాగా పేర్కొంది. ఇటీవల కొంతకాలంగా మీనాక్షి చౌదరికి టాలీవుడ్ హీరోలతో ప్రేమాయణం ఉందంటూ పలు రూమర్స్ వినిపించాయి. అయితే వాటన్నింటినీ ఆమె ఖండిస్తూ, పూర్తిగా అబద్ధమని కొట్టి పారేసింది. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది. 'అనగనగా ఒక రాజు' సినిమాతో పాటు మీనాక్షి చౌదరి ఇతర భాషల్లోనూ బిజీగా ఉంది. కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ నటిస్తున్న 63వ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే తమిళంలో 'వృషకర్మ' అనే చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది.

# నాలుగు రోజుల్లో రూ.200 కోట్లు.. 'ది రాజాసాబ్' రికార్డు కలెక్షన్స్!




రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'ది రాజాసాబ్'మూవీకి మిక్స్‌డ్ టాక్ వచ్చినా.. బాక్సాఫీస్ వద్ద మాత్ర భారీ కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది. తొలి రోజే రూ. 112 కోట్లు వసూలు చేసిన 'రాజాసాబ్'... నాలుగు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా 201 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను సాధించింది. ఈ మేరకు మేకర్స్ అధికారికంగా ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ ఈ రేంజ్‌లో కలెక్షన్స్ రాబట్టడం చూసి ట్రేడ్ వర్గాలు షాకవుతున్నాయి. అయితే ప్రభాస్ స్థాయికి ఈ కలెక్షన్స్ తక్కువే కానీ.. పోటీలో చిరంజీవి లాంటి సినిమాలు ఉన్నప్పటికీ ఈ స్థాయిలో రావట్టడం గొప్ప విషయం. మారుతి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పిపుల్ మీడియా ఫ్యాక్టర్ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటించారు. సంక్రాంతి కానుకగా ఈ నెల 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హాలీడేస్ సీజన్ లో ఫస్ట్ వీక్ "రాజా సాబ్" హ్యూజ్ నెంబర్స్ క్రియేట్ చేస్తుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి.

# భాషతో సంబంధం లేదు.. నచ్చితే ఓకే చెప్తా కల్యాణి ప్రియదర్శన్

ఇటీవల 'లోకా: ఛాప్టర్ 1 – చంద్ర' చిత్రంతో అదిరిపోయే విజయాన్ని అందుకున్న నటి 'కల్యాణి ప్రియదర్శన్'. అందులో సూపర్ హీరో పాత్రలో నటించి మలయాళంతో పాటు, తమిళం తెలుగు, ప్రేక్షకులను అలరించారు. అంతేకాకుండా మాతృభాషతో పాటూ తెలుగు, తమిళం భాషల్లో కథానాయికిగా నటిస్తూ బిజీగా ఉన్న ఈ బ్యూటీ తాజాగా బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా ఇటీవల ఈ అమ్మడు ఒక భేటీలో పేర్కొంటూ లోకా చిత్రం తరువాత తనకు పలు భాషల్లో పలు అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. అయితే మంచి పాత్ర అని అనిపిస్తే నటించడానికి సిద్ధమని పేర్కొన్నారు. మరాఠీ, హిందీ, తెలుగు, తమిళం, మలయాళ భాషలను తాను ఎప్పుడు వేర్వేరుగా చూడనన్నారు. కథ చెప్పడం అన్నది ప్రపంచ భావోద్వేగం అన్నారు. ఒక మంచి కథలో నటించే అవకాశం వస్తే పూర్తి సమయాన్ని కేటాయించి, మనసుపెట్టి నటించడానికి తాను ఎప్పుడు సిద్ధమే అన్నారు. కాగా ఈమె రవి మోహన్ సరసన నటించిన జీనీ చిత్రం నిర్మాణ కార్యక్రమం పూర్తిచేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. కాగా ప్రస్తుతం కార్తీ కి జంటగా మార్షల్ చిత్రంలో నటిస్తున్నారు. మరిన్ని చిత్రాలు తన కోసం ఎదురుచూస్తున్నట్లు తనుస్వయంగా చెప్పారు. అదేవిధంగా తనకు సూపర్ హీరో ఇమేజ్ తెచ్చిపెట్టిన లోకా చిత్రానికి పార్ట్ 2 కూడా ఉంది. ఇందులో కూడా ఆమె నాయకగా నటించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.



# బాలీవుడ్‌లో హద్దులు దాటుతున్న పీఆర్ వ్యూహాలు



బాలీవుడ్ నటి తాప్సీ పన్ను ఇటీవల హిందీ చిత్ర పరిశ్రమలో పెరుగుతున్న పబ్లిసిటీ సంస్కృతిపై తన అభిప్రాయాన్ని బహిరంగంగా వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో బాలీవుడ్‌లో పీఆర్ వ్యూహాలు పూర్తిగా మారిపోయాయని, ఇప్పుడు ప్రమోషన్ అనేది కేవలం తమ సినిమా గురించి మాట్లాడటానికే పరిమితం కాకుండా, ఇతరులను తక్కువగా చూపించే స్థాయికి వెళ్లిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొన్ని పీఆర్ టీమ్స్ తమ సినిమాలకు హైప్ క్రియేట్ చేయడానికి ఇతర నటులు, సినిమాలపై నెగటివ్ కథనాలు ప్లాంట్ చేస్తున్నాయి. ఇది ఒక రకమైన పోటీ కాదు, పూర్తిగా తప్పుదారి పట్టిన విధానం" అని వ్యాఖ్యానించారు. సినిమా కంటెంట్, నటన, కథ బలం గురించి మాట్లాడాల్సిన చోట, వ్యక్తిగత విమర్శలు లేదా ఇతరులపై నిందలు వేయడం ట్రెండ్‌గా మారిందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇలాంటి పీఆర్ గేమ్స్‌లో తాను ఎప్పుడూ భాగం కాలేదని తాప్సీ స్పష్టం చేశారు. నేను అలాంటి వ్యూహాలకు దూరంగా ఉండటం పట్ల చాలా రిలీఫ్‌గా ఫీలవుతున్నాను. నా పని నా సినిమాల ద్వారా మాట్లాడాలని నమ్ముతాను. ఇతరులను కిందకు లాగి పైకి రావడం నాకు ఇష్టం లేదు అని ఆమె తెలిపారు. ఈ మాటలు ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన పోటీ అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని సినీ విశ్లేషకులు అంటున్నారు. తాప్సీ వ్యాఖ్యలు బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం స్టార్ ఇమేజ్, సోషల్ మీడియా ట్రెండ్స్, వైరల్ కథనాలే సినిమాల భవితవ్యాన్ని నిర్ణయిస్తున్న సమయంలో, ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు పీఆర్ వ్యవస్థపై పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,